# లోకల్ గైడ్

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

LGTV

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.

ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094



ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,138 | పేజీలు -12 | సోమవారం - 16 - మార్చి - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, Yadadri Bhuvanagiri


## భారీ ఎన్‌కౌంటర్.. పాక్ ఉగ్రవాది హతం



విధి నిర్వహణలో జేసీవో వీరమరణం

ఒక పాక్ ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి

## నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు మోగిన నగారా.. తక్షణమే అమల్లోకి కోడ్.. మే 4న ఫలితాల వెల్లడి



మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు

ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది

అస్సాం, కేరళ, పుదుచ్చేరిల్లో ఏప్రిల్ 9న పోలింగ్

## నోటిఫికేషన్‌కు ముందు మమతా బెనర్జీ కీలక నిర్ణయం..



### పెండింగ్ డీఏ విడుదల

ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏ బకాయిలు విడుదల చేయాలని నిర్ణయం

ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు

## కేసీఆర్‌ది అభివృద్ధి అయితే రేవంత్‌ది విధ్వంసం.. హరీశ్‌రావు ఫైర్

- బుల్డోజర్లతో ఇండ్లను కూల్చడమే పనిగా పెట్టుకున్నాడని తెలిపారు
- కాంగ్రెస్ వచ్చాక ప్రజలందరూ ఇబ్బందుల్లోనే ఉన్నారు
- రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు
- రేవంత్ రెడ్డి జూనియర్ యోగి అయిపోయాడని హరీశ్‌రావు విమర్శలు
- ఈ రెండున్నర సంవత్సరాల్లో ఒక్క మంచి పనైనా చేశారా అని ప్రశ్నించారు



హైదరాబాద్: కేసీఆర్‌ది అభివృద్ధి అయితే రేవంత్ రెడ్డిది విధ్వంసమని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. బుల్డోజర్లతో ఇండ్లను కూల్చడమే పనిగా పెట్టుకున్నాడని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక ప్రజలందరూ ఇబ్బందుల్లోనే ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ ముషీరాబాద్ బోలక్‌పూర్‌లోని అంజుమన్ గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన

# డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం...

## - కాంగ్రెస్ సవాల్ స్వీకరించిన కేటీఆర్

- డ్రగ్స్ కేసును అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లడం నీచ రాజకీయాలకు నిదర్శనం
- డ్రగ్స్ వాడేవారు ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు
- మనమే ఉదాహరణగా నిలుద్దాం" అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు
- ప్రతీ డ్రగ్స్ కేసులోకి అనవసరంగా తన పేరును లాగితే చట్టపరమైన నోటీసులతో స్పందించాల్సి ఉంటుంది



అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ పరీక్ష చేయించుకోవాలన్న మహేశ్ కుమార్ గౌడ్ సూచనను స్వాగతిస్తున్నాను

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాను డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉన్నానని ఆదివారం ప్రకటించారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలు విసిరిన సవాల్‌ను ఆయన స్వీకరించారు. డ్రగ్స్ వాడేవారు ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు.

## 'కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలి'.. ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ లేఖ

ద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారని తెలిపారు

ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించింది

2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో..

కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడం

ఆయన దేశానికి చేసిన సేవలకు దక్కే నిజమైన గౌరవం



## నెతన్యాహును వెంటాడి చంపుతాం



ఇంటర్నెట్ డెస్క్: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గత కొంతకాలంగా బహిరంగ కార్యక్రమాల్లో కనిపించకపోవడంతో రకరకాల వదంతులు బయలుదేరాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఇరానియన్ రెవల్యూషనరీ గార్డ్స్ ఘాటు హెచ్చరిక చేసింది. నెతన్యాహు బతికి ఉన్నట్టే అయితే ఆయనను వెంటాడి మరీ అంతమొందిస్తామని హెచ్చరించింది.

## డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు ఎంపీ...

# టీడీపీపై షర్మిల ఫైర్



అమరావతి: ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో టీడీపీ ఎంపీ పట్టుబడటం సిగ్గుచేటని విమర్శించారు. అతడిపై తక్షణమే అనర్హత వేటు వేయాలని, తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై చంద్రబాబు సీరియస్... నోటీసులు ఇవ్వాలని పల్లాకు ఆదేశం!



పుట్టా మహేశ్ నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

ఈ ఘటనపై పార్టీపరంగా కఠిన చర్యలు ఉంటాయనే సంకేతాలు

## డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన పుట్టా మహేశ్‌కు ఎంపీగా ఉండే అర్హత లేదు

### - కాకాణి గోవర్ధన్ రెడ్డి



- పుట్టా మహేశ్‌ను రక్షించడానికి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే రంగంలోకి దిగారు
- డ్రగ్స్ మాఫియాను ఆయనే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు.
- సామాన్యుడికి ఒక రూల్, ప్రజాప్రతినిధికి మరో రూల్ ఉండకూడదు

# ఏపీలో నేటి నుండి "రైతన్న మీ కోసం".. చంద్రబాబు ఆదేశం!

రైతులకు అవగాహనా కార్యక్రమం

రైతు సేవా కేంద్రం పరిధిలో కార్యక్రమాలు

రైతాంగ సంక్షేమానికి ఏపీ సర్కార్ పెద్దపీట



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతాంగ సంక్షేమం కోసం రైతులకు అవగాహన కల్పించడం కోసం మార్చి 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు రైతులకు మద్దతుగా రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ అభివృద్ధికి ఊతమిచ్చే పంచ సూత్రాలతో పాటు అగ్రి టెక్, డీప్ టెక్ ద్వారా సాగు విధానాలపై రైతులకు ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నారు.

రైతులకు అవగాహనా కార్యక్రమం

ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రారంభమవుతుందని తెలుస్తోంది. రైతు సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఏపీలోని రైతులు ఎల్నినో నేపథ్యంలో ముందస్తు అంచనా ప్రకారం ప్రాంతాలవారీగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఈ అవగాహన కార్యక్రమంలో సూచనలు పొందనున్నారు.

## పార్లమెంట్ మెట్లపై టీ, పకోడీ.. రాహుల్ గాంధీకి ఆ మాత్రం తెలియదా - అమిత్ షా ఆగ్రహం



రాహుల్ గాంధీ పార్లమెంట్ మెట్లపై నిలబడి టీ, పకోడీ తీసుకోవడంపై అమిత్ ఆగ్రహం వ్యక్తం

పార్లమెంట్ అనేది చాలా పవిత్ర స్థలమని, అల్పాహారం ఎక్కడ తీసుకోవాలో కూడా రాహుల్‌కు తెలియదా

అనంతరం ప్రసంగిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ గత పాలనపై విమర్శలు గుప్పించారు

# ఖమ్మం నగర కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం



ఖమ్మం :లోకల్ గైడ్ :17వ డివిజన్ అధ్యక్షులు ప్రతాని నర్సింహారావు గారి అధ్యక్షతన ఖమ్మం కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ముఖ్య అతిథిగా 3 టౌన్ ఇంచార్జ్ బాలగంగాధర్ తిలక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 17వ డివిజన్ సమస్యలు కార్యకర్తలు నాయకుల మధ్య సమన్వయం మరియు డివిజన్ బూత్ స్థాయి లో కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు నాయకులకు ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు ఈకార్యక్రమంలో ఐ ఎన్ టి యు నగర అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ , నరేష్ మోహన్ నాయుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్లమల ఆనంద్ , కోసూరి రమేష్ గౌడ్ , సత్యం , దిరిశాల శ్రీను , ముత్యం కొండల్ రావు , రెడ్డి , పద్మం వెంకటేశ్వర్లు , జానీ తదితరులు పాల్గొన్నారు

# స్మార్ట్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ కార్యాలయం ప్రారంభం నగర మేయర్ పునుకొల్లు నీరజ,

ఖమ్మం :లోకల్ గైడ్ :నగరంలోని బైపాస్ రోడ్, బ్యాంక్ కాలనీలో ఉన్న రఘు కాంప్లెక్స్‌లో స్మార్ట్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని ఖమ్మం నగర మేయర్ శ్రీమతి పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఇంజనీరింగ్ మరియు మెడికల్ విద్యను భారత్‌లో అలాగే విదేశాల్లో అభ్యసించాలనుకునే విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించే లక్ష్యంతో ఈ కన్సల్టెన్సీ ప్రారంభించబడింది. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఉన్నత విద్యలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటువంటి కన్సల్టెన్సీలు విద్యార్థులకు సరైన దిశలో మార్గదర్శకత్వం అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ మోతారపు శ్రావణ సుధాకర్. పైడిపల్లి సత్యనారాయణ, పాల్గొన్నారు. అలాగే సంస్థ ప్రతినిధులు మధు నేహా విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యరసానిగూడెం గ్రామంలో ఉచిత చెవిముక్కుగొంతు వైద్య శిబిరం.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .జనవరి 15. (లోకల్ గైడ్). కట్టంగూర్ మండలం యరసానిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని చిన్మయి హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్యులు డా. చెవుల శ్వేత ఆధ్వర్యంలో ఉచిత చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు . ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఆకిటి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకిటి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం చాలా అవసరమన్నరు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా చెవి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్మయి హాస్పిటల్ వైద్య బృందానికి, డాక్టర్ శ్వేతకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు, గ్రామపంచాయితీ సిబ్బందికి, విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. చెవి, ముక్కు, గొంతు ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింత యాదగిరి, ఉపాధ్యాయులు గాలి సంధ్యారాణి, తరాల పరమేశ్ యాదవ్, వార్డు సభ్యులు నామా సైదులు, గ్రామ పెద్దలు పులకరం నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, చైతన్య, సుధాకర్, నాగార్జున, ఆశా వర్కర్ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గంగమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం.

నూకల అభినవరెడ్డి

లోకల్ గైడ్ జిల్లా ప్రతినిధి మహబూబాబాద్ :మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లో - కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నూకల అభినవరెడ్డి - ఘనంగా గంగమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం.- గంగమ్మ ఆశీస్సులతో అంతా శుభమేమరిపెడ : మండలంలోని పురుషోత్తమాయ గూడెం గ్రామ శివారు ఆకేరు వాగు సమీపంలోని గంగమ్మ ఆలయం తృతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నూకల అభినవ్ రెడ్డి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభినవరెడ్డి మాట్లాడుతూ గంగమ్మ తల్లి దీవెనలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గంగమ్మ దేవతకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో పురుషోత్తమాయ గూడెం గ్రామస్తులతో పాటు సీతారాం తండావాసులు, గ్రామ సర్పంచ్ వెన్నెల రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలం రవీందర్ రెడ్డి, గంధసిరి అంబరీష, మెంచు అశోక్ కుమార్ గౌడ్, పటేల్ దుర్గయ్య, పిట్టల శీను, రజక శ్రీనివాస్,కళాధర్, రామ్మూర్తి, లింగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన సారపాక సర్పంచ్ ఉపసర్పంచ్

## వార్డు సభ్యులు నవ్యశ్రీ, సావిత్రిలకు అభినందనలు తెలిపిన సర్పంచ్ ఉపసర్పంచ్



భద్రాద్రి జిల్లా, బూర్గంపాడు : లోకల్ గైడ్ :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మ గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్, ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్ ఆదివారం ప్రారంభించారు. సారపాక గ్రామపంచాయతీ 13వ వార్డు సభ్యురాలు పోతిరెడ్డి నవ్యశ్రీ, 14వ వార్డు సభ్యురాలు కొమరం సావిత్రి ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముందు ముత్యాలమ్మ గుడిలో పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి, అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్ రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భక్తులు, ప్రయాణికులు, వివిధ పనుల కోసం వచ్చి వెళ్లే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ముందుకు వచ్చిన పోతిరెడ్డి నవ్యశ్రీ, కొమరం సావిత్రిలను అభినందించారు. ప్రజల కోసం స్వచ్ఛందంగా మంచి కార్యక్రమాలు చేపడుతున్న తమ పాలకవర్గ సభ్యులను ప్రోత్సహిస్తామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి, ఎన్‌హెచ్‌ఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామెర ఆదినారాయణ, లాగిన్ నెట్ సెంటర్ అధినేత పోతిరెడ్డి అశోక్ రెడ్డి, స్థానికులు గుంజు రమేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ నెలాఖరు నాటికి గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి....

## రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు

## లాభదాయక పంటల వైపు రైతులు దృష్టి సారించాల

## కొణిజెర్ల మండలం అంజనాపురంలో ఏర్పాటు చేస్తున్న గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి తుమ్మల





కొణిజెర్ల, మార్చి -15:లోకల్ గైడ్ :ఏప్రిల్ నెలాఖరు నాటికి గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం కొణిజెర్ల మండలంలో పర్యటించి అంజనాపురంలో ఏర్పాటు చేస్తున్న గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనుల పురోగతిని, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో ఆయిల్ పామ్ మొక్కలు తీసుకొచ్చి మొదటిసారిగా నాటడం జరిగిందని అన్నారు. అప్పటివరకు మనకు ఈ పంట లేదని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కూడా ఆయిల్ పామ్ పంట విస్తరణ కోసం అనుమతులు తాను సాధించినట్లు మంత్రి అన్నారు. ప్రతి ఎకరానికి 51 వేల రూపాయలు సబ్సిడీ ప్రభుత్వం రైతులకు అందిస్తుందని అన్నారు. పంటల మార్పిడి చేసుకోలేకపోతే రైతులు ఇబ్బందులు పడతారని, ధాన్యం కొనుగోలును కేంద్ర ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తున్నదని తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలో వరి పంట వేయకపోతే డబ్బులు ఇస్తున్నారని అన్నారు. యూరియా అధిక వాడకం వల్ల పంజాబ్ లో క్యాన్సర్ ఎక్కువ అయిందని, ప్రస్తుతం మన దగ్గర కూడా యూరియా ఎక్కువగా వాడుతున్నామని దీనివల్ల నష్టాలు వస్తాయని అన్నారు. పంటల మార్పిడి విధానం రైతులు తప్పని సరిగా అనుసరించాలని లేని పక్షంలో చాలా నష్టాలు వస్తాయని మంత్రి అప్రమత్తం చేశారు. మల్టీ నేషనల్ కంపెనీ గోద్రెజ్ వ్యవసాయ ఉత్పత్తులపై దృష్టి సారించిందని, ఏపీలో గతంలోనే ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారని ప్రస్తుతం ఖమ్మంలో ఫ్యాక్టరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ తో పాటు ఇక్కడ రీసెర్చ్ డెవలప్మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఈ నెల 22న సిద్దిపేట జిల్లాలో సీఎం రేవంత్ చేతుల మీదుగా జరిగే నూతనంగా నిర్మించిన నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రైతులందరూ వెళ్లాలని, అక్కడ 3 రోజుల పాటు వ్యవసాయ ప్రదర్శన ఉంటుందని అన్నారు. సీడ్ గార్డెనింగ్ ఏర్పాటుకు కంపెనీలకు ప్రభుత్వం నుంచి సంపూర్ణంగా సహకారం అందిస్తామని అన్నారు. సీడ్ గార్డెనింగ్ కోసం రైతుల దగ్గర్నుంచి భూమి తీసుకునే సమయంలో వారు సంతోషంగా ఉండేలా పరిహారం అందించాలని మంత్రి ఆదేశించారు. సీడ్ గార్డెనింగ్ ఏర్పాటు చేయడం ద్వారా దేశ రైతాంగానికి ఉపయోగపడుతుందని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కోరారు. అకాల వర్షాలు, కరువు కాటకాలకు తట్టుకొని నిలబడే పంట ఆయిల్ పామ్ అని అన్నారు. మిర్చి, మొక్క జొన్న, చివరికి వరిలో కూడా అంతర్ పంట కింద సాగు చేసి మొదటి 3 సంవత్సరాలు ఆదాయం సమకూర్చుకోవచ్చని తెలిపారు. ధాన్యం పంట సాగు వైపు కాకుండా వక్క, జాజి, ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటల వైపు రైతులు దృష్టికి సారించాలని అన్నారు. కష్టాలు లేకుండా తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం వచ్చే పంట ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ మాత్రమేనని అన్నారు. సీడ్ గార్డెనింగ్ కు సంబంధించి ఫ్యాక్టరీ సమీపంలో ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం రైతులను ఒప్పించి నెలాఖరు నాటికి సేకరణ చేయాలని అన్నారు. ఫ్యాక్టరీ వద్ద రోడ్లు, సబ్ స్టేషన్ సకాలంలో అందేలా చూడాలని అన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ రావడం ద్వారా రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీనీ త్వరగా పూర్తి చేసుకొని ప్రారంభించుకునే విధంగా అవసరమైన అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. ఆయిల్ పామ్ సాగు జిల్లాలో క్రమంగా పెరుగుతుందని, ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ద్వారా స్థానిక రైతాంగానికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, ప్రాజెక్ట్ డిజిఎం., సర్పంచ్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి.

## ఐక్య ఉద్యమాలను బలోపేతం చేద్దాం.ఎస్ వీరయ్య.





నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.మార్చి 15. (లోకల్ గైడ్). కేంద్ర ప్రభుత్వం కార్మికుల పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఎఫ్సిఐ ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న సిఐటియు నల్గొండ జిల్లా 13వ మహాసభలలో ముగింపు ఉపన్యాసం చేశారు ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాల వలన కార్మిక వర్గానికి అందుతున్న కొద్దిపాటి ప్రయోజనాలను కూడా దూరం చేయడానికి కార్పొరేట్లకు ప్రయోజనాలు కలిగించేందుకు ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరున సమస్యలను తీసుకొని రావడం కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని ఆరోపించారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భారత కార్మిక వర్గం గత ఐదు సంవత్సరాలుగా అనేక ఆందోళన పోరాటాలు నిర్వహించిందని అన్నారు కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె అన్ని కార్మిక సంఘాలు నిర్వహించగా 30 కోట్ల మంది కార్మికులు సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేయడం జరిగిందని అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోళ్లను మా రాష్ట్రాలలో అమలు చేయమని కేరళ పశ్చిమ బెంగాల్ తమిళనాడు రాష్ట్రాలలో అసెంబ్లీ లో తీర్మానాలు చేశారని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో కూడా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు .ట్రేడ్ యూనియన్ యాక్ట్ 1926 ఇండస్ట్రియల్ డిస్పే యాక్ట్ 1947 ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యాక్ట్ కలిపి సంఘం పెట్టుకునే హక్కు మీద దాడి చేస్తున్నారని 1926లో బ్రిటిష్ కాలంలో సాధించుకున్న కార్మిక హక్కులను వంద సంవత్సరాల తర్వాత మోడీ ప్రభుత్వం హరించి వేయడం అన్యాయమని రేడియన్ గుర్తింపు యజమానులు ప్రభుత్వాల దయాదాక్షిన్యాల కు వదిలేయడం సిగ్గుచేటు అని అన్నారు 300 మంది లోపు కార్మికుల ఉన్న పరిశ్రమల లే ఆఫ్ లాకౌట్ లకు ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండా చేయడం ఐరన్ ఫైర్ సిస్టం ప్రకారం ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ సిస్టం తీసుకురావడం ఉద్యోగ భద్రతకు స్వస్తి పలకడమేనని అన్నారు. ఈ మహాసభలో కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని తదితర 26 తీర్మానాలను మహాసభ ఆమోదించడం జరిగింది అనంతరం జిల్లా నూతన కమిటీని 55 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి వంగురి రాములు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, లక్ష్మీనారాయణ ఎండి సలీం డబ్బికార్ మల్లేష్, దండంపల్లి సత్తయ్య అవుట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ

అధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి సలీం, కోశాధికారి బి ప్రమీల, ఉపాధ్యక్షులు డబ్బికారు మల్లేష్, చినపాక లక్ష్మీనారాయణ, అవుత సైదులు, దండంపల్లి సత్తయ్య, లకపాక రాజు, మల్లు గౌతమ్ రెడ్డి, చింతపల్లి బయన్న, సహాయ కార్యదర్శులు నల్ల వెంకటయ్య, ఏర్పుల యాదయ్య, పెంజెర్ల సైదులు, అవుత రవీందర్ వల్లపు దాసు భూలక్ష్మి, డి రవి నాయక్, ఎస్.కె బషీర్ మరో 38 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


# ఫింగర్ ప్రింట్ డివైస్ తో నేరాల అదుపు : ఎస్సై వెంకటేశ్వర్లు



నారాయణపేట మార్చి 15: (లోకల్ గైడ్)నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు హనుమంత్, అశోక్ లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు నారాయణ పేట బస్టాండ్, ప్రధాన చౌర స్తాలలో, బ్యాం కు ల వద్ద నారాయణ పేట పోలీసులు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానా స్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటు వంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


# మున్సిపాలిటీలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## అధికారులకు శివారెడ్డి ఆదేశం



నారాయణపేట మార్చి 15:(లోకల్ గైడ్) నారాయణపేట మున్సిపాలిటీలో ప్రజల సమస్యలను వెంటనే. పరిష్కరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారంఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా నారాయణపేట పట్టణంలో 23, 24 వ వార్డు ల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో నీటి సమస్యలు, మురుగు కాల్వలు శుభ్రం చేయడం,విద్యుత్ స్తంభాలు వంటి పలు సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిం చాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎప్ప టికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయ కుడు చిట్టెం మాధవ రెడ్డి, పుర కమీషనర్ నర్సయ్య, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిలో వెనకడుగు వేసేది లేదు దశలవారీగా అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు



ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి మార్చి15(లోకల్ గైడ్ న్యూస్):10 ఏళ్లలో జరగని అభివృద్ధి రెండు సంవత్సరాల్లో పూర్తిరూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన..ఆదివారంవరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో ఎలాంటి వెనకడుగు ఉండదని, ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, అదే దిశగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కూడా సమగ్ర అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ఆదివారం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 58వ డివిజన్‌లోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, మురికి కాల్వల నిర్మాణ పనులను ప్రారంభించారు. 9వ డివిజన్‌లోని కాకతీయ లైన్ ప్రాంతంలో రూ.1.30 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా 10వ డివిజన్‌లో అలంకార్ జంక్షన్ ఆవరణలో రూ.29.50 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.2 కోట్లకు పైగా నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో జరగని అభివృద్ధి పనులను తాము రెండు సంవత్సరాల్లోనే వేగంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాటికి తక్షణ పరిష్కారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండూ సమానంగా అందుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం తమ లక్ష్యమని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరగాలంటే స్థానిక ప్రజల సహకారం కూడా అవసరమని, ప్రజలు సహకరిస్తే మరింత వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎమ్మెల్యేకు స్థానికులు సమస్యలను వివరించగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాల్వంచ పట్టణంలోని శ్రీనివాసగిరి కాలనీలో ఉన్న
# శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో

**శ్రీనివాస కళ్యాణం మహోత్సవం కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి ఆలయ నిర్వాహకులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.**



పాల్వంచ:లోకల్ గైడ్ :మంత్రి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వహించిన శ్రీనివాస కళ్యాణం మహోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి కార్యక్రమాన్ని భక్తి పరవశంతో వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు మరియు ఆశీర్వాదాలను మంత్రి అందజేశారు.మంత్రి మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, భక్తి భావం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కృపతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని అన్నారు ఈ సందర్భంగా మంత్రి స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించి తమ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులు ఎంతో ఉత్సాహంగా ఈ మహోత్సవాన్ని వీక్షిస్తూ స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం మొత్తంభక్తి వాతావరణంలో ఎంతో వైభవంగా జరిగింది.

# చర్ల మండలంలో మాన్యవర్ కాన్షీరాం 92వ జయంతి వేడుకలు



చర్ల : లోకల్ గైడ్ : చర్ల మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు పాయల మోహన్ రావు అధ్యక్షతన మాన్యవర్ కాన్షీరాం 92వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, మాన్యవర్ కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పాయల మోహన్ రావు మాట్లాడుతూ, మాన్యవర్ కాన్షీరాం జీవితాంతం అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహానీయ నాయకుడని అన్నారు. సమాజంలో దళితులు, బహుజనులు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలనే లక్ష్యంతో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.బహుజన సమాజానికి రాజకీయ శక్తిని కల్పించాలనే దృఢ సంకల్పంతో కాన్షీరాం బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించి, లక్షలాది మందికి మార్గదర్శకుడిగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. సమానత్వ సమాజం ఏర్పడాలంటే ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడవాలని పాయల మోహన్ రావు పిలుపునిచ్చారు. మాన్యవర్ కాన్షీరాం ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లి బహుజన రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని ఆయనన్నారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు నేటి తరానికి ప్రేరణగా నిలుస్తాయని, సమాజంలో మార్పు తీసుకురావడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చెన్నం మోహన్, పార్టీ నాయకులు పాయం ప్రమీల, చాప భాస్కర్ రావు, పాయం త్రిమూర్తి, దువ్వ నర్సింగ్, కాక నర్సయ్య, మొడియం రాము, కనితి లక్ష్మణ్, కాక రమేష్, కారం శంకర్, పాయం రమేష్, గట్టుపల్లి ఆధినారాయన, గట్టుపల్లి నర్సింగరావులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 262 మందిపై కేసులు నమోదు



సైబరాబాద్, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను విస్తృతంగా నిర్వహించినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-× రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 262 మందిని పోలీసులు పట్టుకొని వారి పై కేసులు నమోదు చేశారు. ఈ డ్రైవ్‌లో పట్టుబడిన వారిలో 205 మంది ద్విచక్ర వాహనదారులు, 05 ఆటో డ్రైవర్లు, 50 మంది కారు డ్రైవర్లు, 02 మంది హెవీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ (బిఏసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే-233 మంది 36 మి.గ్రా/100 మి.లీ నుంచి 200 మి.గ్రా/100 మి.లీ మధ్య, 19 మంది 201 మి.గ్రా/100 మి.లీ నుంచి 300 మి.గ్రా/100 మి.లీ మధ్య, మరో 10 మంది 301 మి.గ్రా/100 మి.లీ నుంచి 550 మి.గ్రా/100 మి.లీ మధ్య మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వారందరినీ చట్ట ప్రకారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే భారతీయ న్యాయ సంహిత-2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా గత వారం 2026 మార్చి 09-2026 మార్చి 14) మధ్య నమోదైన డ్రంక్ డ్రైవింగ్ కేసుల్లో మొత్తం 187 కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 02 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష, 23 మందికి జరిమానాతో పాటు సోషల్ సర్వీస్, 162 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘం కార్మికుల కాళ్లు కడిగిన సర్పంచ్



నారాయణపేట మార్చి 15:(లోకల్ గైడ్) గ్రామ పంచాయతీ సిబ్బంది చేస్తున్న సేవలు అమోఘమ ని వారు సేవకులు వెల కట్టలే నివని ఊట్కూర్ సర్పంచ్ ఎం. రేణుక భరత్ అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ గ్రామ పంచా యతీ కార్యాలయం వద్ద ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికుల కాళ్లు కడిగి ఘనం గా సన్మానించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నిత్యం గ్రామ పంచాయ తీ సిబ్బంది ఏదో ఒక కాలనీ లో తమ సేవలు చేస్తూ నిరం తరం ప్రజల మధ్య ఉంటూ చేస్తున్న సేవలు ఆదర్శనీ యమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ గ్రామ పంచాయతీ కార్మికుల సేవలను గుర్తించా లని అన్నారు. ఊట్కూర్ పట్టణంలో 16 వార్డులు ఉన్నాయని సిబ్బంది కొరత ఉన్న ఏ వార్డులో సమస్య ఉన్న తక్షణమే స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసు కుంటున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పారిశుద్ధ్య కార్మి కులకు వైద్య పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, పంచా యతీ కార్యదర్శి శ్రీనివాసరా వు, వార్డు సభ్యులు గోవింద మ్మ, సువర్ణ, భరత్, నరేష్, అక్షయ్, మౌనిక, నరేష్, రూప తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ ను సద్వినియోగం చేసుకొని జనగణన పకడ్బందీగా చేపట్టాలి.. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మం, మార్చి - 15:లోకల్ గైడ్ :శిక్షణ ను సద్వినియోగం చేసుకొని, జనగణన-2027 ను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన గణన అధికారి అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులకు చేపట్టిన 3 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జనగణన సమాచారం వివిధ పథకాల రూపకల్పన, నియోజకవర్గాల పునర్విభజన, ఓటరు నమోదు ప్రక్రియ లో ఎంతో కీలకమని అన్నారు. జనగణన ఎన్యుమరేషన్ బ్లాక్ ఎంపిక ప్రక్రియ చేయాలన్నారు. జనగణన లో తొలిసారిగా డిజిటల్ ఆధారంగా గణన ప్రక్రియ, పౌరులు వెబ్ ఆధారంగా తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకొనే అవకాశాన్ని కల్పించాలని కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో ఇండ్ల జాబితా ప్రక్రియ ను 11 మే, 2026 నుండి 9 జూన్, 2026 వరకు, రెండవ దశలో జనగణన ఫిబ్రవరి, 2027 నెలలో జరుగునని కలెక్టర్ అన్నారు.శిక్షణ లో ఛార్జ్ అధికారులైన తహశీల్దార్లు, అదనపు ఛార్జ్ అధికారులైన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ పరిధిలోని మునిసిపల్ కమిషనర్లు, మేనేజర్లు హాజరుకాగా, డైరెక్టరేట్ జనగణన విభాగం సంయుక్త సంచాలకులు శ్రీకాంత్, మాస్టర్ ట్రైనర్ రవికుమార్ శిక్షణ ను ఇవ్వనున్నారు.శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా గణనాధికారి ఏ. శ్రీనివాస్ ఏ. శ్రీనివాస్ సమన్వయం చేస్తూ, జనగణన యొక్క ప్రాముఖ్యత, ఇందులో వివిధ అధికారుల పాత్రను వివరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగం ఆవిష్కరణ

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ జిల్లా ప్రతినిధి మార్చి15(లోకల్ గైడ్ న్యూస్):బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం రోజున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపకులు గంగు ఉపేంద్ర శర్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అయినవోలు వెంకట సత్య మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుదిమల్ల శ్రీనివాసాచార్యులు, లలిత గాయత్రి సేవా సహకార సంస్థ నాయకులు చకిలం సుధాకర్ రావు, పంచాంగ సిద్ధాంతకర్త వి. బాలకృష్ణ శర్మ, దశమహావిద్య ఉపాసకులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పంచాంగ కర్తలు ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ముహూర్తాలు, పండుగల విషయంలో ప్రజల మనోభీష్టాలు నెరవేరేలా పంచాంగాలను సిద్ధం చేయాలని సూచించారు. పండుగల విషయంలో విభిన్న అభిప్రాయాలు ఉండకూడదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమ్మక్కసారలమ్మ జాతర, బతుకమ్మ పండుగ, దసరా ఉత్సవాలు వంటి పండుగలు అత్యంత ప్రాముఖ్యత కలిగినవని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ముస్లింల సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి




తొర్రూర్ (లోకల్ గైడ్ )మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కేంద్రానికి చెందిన జమా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని, టిపిసిసి ఉపాధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి,బొకేలు అందించి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిలు సంయుక్తంగా మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమాన్ని గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని తెలుపుతూ మైనార్టీల సంక్షేమం కొరకు కృషి చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొంటూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లింల అభివృద్ధి కోసం విద్యా,వైద్య, ఉద్యోగ రంగాలలో నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పించి ముస్లింల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవడానికి కృషి చేయడం జరిగిందని,సబ్బండ వర్గాల సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జమా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ అలీమ్, ఉపాధ్యక్షులు మహమ్మద్ మౌలానా పాషా,మహ్మద్ షబ్బీర్ అలీ,ప్రధాన కార్యదర్శి మహ్మద్ అమీర్, కోశాధికారి మహమ్మద్ గౌస్ మైనోద్దీన్, సహాయ కార్యదర్శులు మమ్మద్ యాకుబ్ పాషా,ఎస్డి చాంద్ పాషా, మున్సిపల్ మాజీ కో-ఆప్షన్ మెంబర్ మహమ్మద్ జలీల్,కమిటీ సభ్యులు మహమ్మద్ సలాం పాషా, మహమ్మద్ అమీనుల్ ఇస్లాం, ముస్లిం మత పెద్దలు మహమ్మద్ నదీమ్, మహమ్మద్ అఫ్జల్, మహమ్మద్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం:7 డివిజన్ టేకులపల్లిలో డబల్ బెడ్



ఖమ్మం,:( లోకల్ గైడ్) రూమ్ కాలనీ వద్ద సిపిఎం ఖానాపూర్ హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు రంజాన్ సందర్భంగా ఏర్పాటుచేసిన తోఫా పంపిణీ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగి

## కూరగాయల షాప్ ఓపినింగ్ లో గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్



లోకల్ గైడ్ ప్రతినిధి మహబూబాబాద్ జిల్లా :మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కేంద్రంలో బయ్యారం బస్టాండ్ సెంటర్ లోని డా. కృష్ణారెడ్డి హాస్పిటల్ ముందు గుగులోత్ శ్రీకాంత్ తాజా కూరగాయల షాప్ ఓపినింగ్ లో పాల్గొన్న బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్,బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య, జిల్లా కార్యదర్శి ములుకురి వీరారెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ లీగల్ అడ్వయిజర్ గుగులోత్ కిషన్ నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాటి జనార్ధన్, బీరెడ్డి శ్రీనివాస్, రిటైర్డ్ ఆర్మీ తుపాకుల సతీష్, కంబాల లింగయ్య, ఆదాం,వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మాజీ ఎంపీ నామ జన్మదిన వేడుకలు

ప్రజా సేవలో ముందుండే

నాయకుడు నామ: ఎమ్మెల్సీ తాత మధు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా

మాజీ ఎంపీ నామ జన్మదిన వేడుకలు



ఖమ్మం :లోకల్ గైడ్ :బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఆదివారం నాడు ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాత మధుసూదన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తాత మధుసూదన్ కేక్ కట్ చేసి నామకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తాత మధు మాట్లాడుతూ నామ నాగేశ్వరరావుకు జిల్లా పార్టీ తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గత మూడు దశాబ్దాలుగా ప్రజా సేవలో నామ చేసిన కృషిని



కొనియాడారు. ప్రజా జీవితంలో మరింత సేవ చేస్తూ, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం, కేటీఆర్ నాయకత్వంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నామ జన్మదిన వేడుకలు శనివారం అర్ధరాత్రి నుంచే ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాత్రి 12 గంటలు దాటగానే కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ నామకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలు ప్రాంతాల్లో యువకులు భారీ కేక్‌లను కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరిపారు. అలాగే ఆదివారం ఉదయం నుంచే పలు దేవాలయాల్లో నామ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం నామ క్యాంప్ కార్యాలయ ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉప్పల వెంకటరమణ, పగడాల నరేందర్, మాజీ సర్పంచ్ మెంటెం రామారావు ఆధ్వర్యంలో ఖమ్మం జీవన్ సంధ్య వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, పాలేరు, వైరా, మధిర, కొత్తగూడెం, అశ్వారావుపేట తదితర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనాధాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో పండ్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. అనాధ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పేదలకు భోజనం అందించేందుకు పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వైరా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నామ పుట్టిన రోజు సందర్భంగా ఇఫ్తార్ విందు కూడా ఏర్పాటు చేశారు. నామ నాగేశ్వరరావు రాజకీయాల్లోకి రాకముందు నుంచే ప్రజా సేవలో ముందుండే వ్యక్తి అని అభిమానులు తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మరించుకున్నారు. రాజకీయంగా మాత్రమే కాకుండా సామాజిక సేవలో కూడా నామ ముందుండి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన నాయకుడిగా నామ నాగేశ్వరరావు పేరు నిలిచిపోయిందని అభిమానులు అన్నారు. నామ నాగేశ్వరరావు ఆయురారోగ్యాలతో మరింత కాలం ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ అభిమానులు, శ్రేయోభిలాషులు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఖమ్మం నగర పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషాబోయిన వీరన్న, కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి, తోట రామారావు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు గోపాల్, భాషాబోయిన వీరన్న, కనగాల వెంకట్రావు, నాయకులు బోజెడ్ల రాంమోహన్, పెనుగొండ ఏడుకొండలు, తన్నీరు రవి, ముత్యాల వెంకటఅప్పారావు, కోటి అనంతరాములు, బంకా మల్లయ్య, మరికంటి రేణుబాబు, వాకదాని కోటేశ్వరరావు, మందడపు వెంకటేశ్వరరావు, కోడె బాబు, కనగాల వెంకటేశ్వర్లు, నామ వెంకన్న, కొత్తపల్లి నాగార్జున, కోటేష్, బలుసు మురళి కృష్ణ, మహమ్మద్ రఫీ, మహిళా నాయకురాలు చిత్తారు ఇందుమతి, ఎమ్మెల్సీ తాత మధు పీఏ సుమంత్, మాజీ ఎంపీ నామ వ్యక్తిగత కార్యదర్శి గోపాళం నాగరాజు, యువ నాయకులు పాల్వంచ రాజేష్, తాళ్లూరి హరీష్ బాబు, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణ ప్రసాద్, పగడాల రవి, షారుఖ్, మునిగంటి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

## ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



**జిల్లా అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్**

రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): జనాభా లెక్కలు 2027 ప్రక్రియలో భాగంగా మొదటి దశ చేపట్టవలసిన ఇండ్ల గణన కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్ ప్రారంభించారు ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో చార్జ్ అధికారులు (తహసీల్దార్ & మున్సిపల్ కమినర్లు), అదనపు చార్జి అధికారులకు నిర్వహిస్తున్న (03) రోజుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జన గణన, ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరంలో మొదటి విడతలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదుచేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు గణన ప్రక్రియ ను నిర్వహిస్తారని, తమ యొక్క మండల పరిధికి చార్జ అధికారులుగా



తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యవహరిస్తారని అదేవిధంగా తమ యొక్క మున్సిపల్ పరిధికి చార్గ్ అధికారులుగా సంబంధిత మున్సిపల్ కమిషనర్ మరియు అదనపు ఛార్జ్ అధికారులుగా మేనేజర్లు వ్యవహరిస్తారని తెలిపారు సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, మాస్టర్ ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని తెలిపారు. 15, 16, 17 రోజులలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సిపిఓ సౌమ్య, జెడ్పి సీఈవో కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, ఆర్డీవోలు తాసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతి



శంషాబాద్ , మార్చ్ 15; (లోకల్ గైడ్):గుర్తు తెలియని వాహనుకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ పరిధిలోని జగన్ పాదకి చెందిన పాలమూరు విజయ్ ( 32) అనే ఎలక్ట్రిషియన్ శనివారము పనిమీద వికారాబాద్ జిల్లా కోస్గికి బైక్ బయలుదేరినాడు. బైక్ చెడిపోయిందని తన అన్న అజయ్ కి ఫోన్ లో తెలపగా ఆదివారం ఉదయం అజయ్, మల్లేష్ అనే ఇద్దరు వ్యక్తులు కార్లో విజయ వద్దకు బయలుదేరారు. ముగ్గురు కలిసి గ గన్ పహాడ్ బయలుదేరారు. మార్గమధ్యంలో శంషాబాద్ మండలం పాలమకుల వద్ద ఆపగా విజయ్ టిఫిన్ కోసము రోడ్డు రోడ్డు దాటి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)బెల్లంపల్లి నియోజకవర్గంలో బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శకుడు అయిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా తిలక్ స్టేడియం నుండి కాంటా చౌరస్తా మీదుగా పూలతోట వరకు బంజారా సంప్రదాయ నృత్యాలతో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో బంజారా యువత,మహిళలు,సేవాలాల్ మహారాజ్ దీక్ష స్వాములు పాల్గొని ఉత్సాహంగా నృత్యాలు చేస్తు సేవాలాల్ మహారాజ్‌కు ఘన నివాళులు అర్పించారు.అనంతరం పూలతోట వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి,మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు కారుకూరి రామచందర్,తెలంగాణ పీసీసీ కమిటీ కన్వీనర్ నాతరి స్వామి,ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఏసీఎంవో లక్ష్మణ్,సేవాలాల్ దీక్ష స్వాములు, కమిటీ సభ్యులు పాల్గొని భోగ్ బండారో కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ బంజారా జాతికి గొప్ప ఆధ్యాత్మిక గురువుగా నిలిచారని అన్నారు.సమాజంలో సమానత్వం,సేవాభావం,సత్యం,ధర్మం అనే విలువలను ఆయన బోధించారని పేర్కొన్నారు.సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.బంజారా ప్రజలకు ఏ సమస్య వచ్చినా దాని పరిష్కారానికి ముందుంటానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సేవలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ సభ్యులు ఒక బోర్‌వెల్,బంజారా భవన నిర్మాణం ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు,తెలంగాణ పీసీసీ కమిటీ కన్వీనర్ లు మాట్లాడుతు ఎమ్మెల్యేతో మాట్లాడి బంజారా సోదరుల డిమాండ్లను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.సేవాలాల్ బంజారా సమాజానికి దిక్సూచి లాంటి మహనీయుడని తెలిపారు.అణగారిన వర్గాల అభ్యున్నతికి,సమాజంలో ఐక్యతకు,ధర్మబద్ధమైన జీవన విధానానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఆయన బోధనలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోత్ మల్లేష్ నాయక్,ఉత్సవ కమిటీ అధ్యక్షులు అజ్మీర బాలాజీ నాయక్,పెరికపల్లి,మన్నెగూడెం,సోమగూడెం కె సర్పంచ్ లు జరుపల సాయికిరణ్ నాయక్,బానోత్ మధుకర్ నాయక్,బోడ బలరాం నాయక్ కమిటీ సభ్యులు,సేవలాల్ మహారాజ్ దీక్ష స్వాములు,మహిళలు,బంజారా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



నారాయణపేట మార్చి 15:(లోకల్ గైడ్ ): నారాయణపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.ఈ కార్యక్రమం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి న్యాయవాదులు పాల్గొన్నారు.ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

## టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ బాధ్యతల స్వీకరణ

వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య....వెల్లడి



హైదరాబాద్ /హనుమకొండ ప్రతినిధి మార్చి15(లోకల్ గైడ్ న్యూస్):గాంధీ భవన్‌లోని ప్రకాశం హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య ఎర్రబెల్లి స్వర్ణ కి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ: మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. మహిళలు రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత చురుకుగా పాల్గొనేలా మహిళా కాంగ్రెస్ కీలక వేదికగా నిలుస్తోందన్నారు. ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతూ మహిళల సమస్యల పరిష్కారానికి బలమైన స్వరం అవుతారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళలను సంఘటితం చేసి పార్టీని మరింత బలపర్చడంలో మహిళా కాంగ్రెస్ ముందుండాలని సూచించారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎంపీ డా. కడియం కావ్య



పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ , మహిళా కాంగ్రెస్ నాయకురాలు సునీతా రావ్ , రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి హమాలీల మహా గర్జన సభలో వారి డిమాండ్స్

రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,



ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి మార్చి15(లోకల్ గైడ్ న్యూస్):ఆదివారం రొజునహనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో తెలంగాణ హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన హమాలీ మహా గర్జన కార్యక్రమం ఘనంగా జరిగింది అన్నారు ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర



మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హమాలీ కార్మికులు పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు.కార్యక్రమానికి ముందు హమాలీలు అంబేద్కర్ జంక్షన్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీ ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగి హయగ్రీవాచారి మైదానం వరకు చేరుకుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుడు తన కష్టంతో సంపాదించే ఏకైక వ్యక్తి అని పేర్కొన్నారు. సమాజం అభివృద్ధి చెందడంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. హమాలీల సమస్యలను తప్పకుండా అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తున్నారని, ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అండగా ఉంటుందని తెలిపారు. హమాలీల సంక్షేమం కోసం తన వంతు సహాయంగా సీడీఎఫ్ నిధుల ద్వారా రూ.20 లక్షలు విడుదల చేస్తానని ప్రకటించారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ హనుమకొండ కేంద్రంలో హమాలీల కోసం భూమి కేటాయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. హమాలీలు రక్తాన్ని చెమటగా మార్చి కష్టాన్ని ఇష్టంగా చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు, ఇంత పెద్ద స్థాయిలో ఒక వేదికపై చేరి తమ సమస్యలను చెప్పడం ఎంతో సంతోషకరమని అన్నారు. హమాలీలకు ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ బోర్డు ఏర్పాటు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ వంటి అంశాలపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కొద్దిపాటి ఆలస్యం జరిగినప్పటికీ తప్పకుండా ఆ హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మండల కేంద్రాల్లో హమాలీ సంఘాలకు భూమి కేటాయించే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క తెలిపారు. గ్రామాల్లో పనిచేసే హమాలీలకు కూర్చునేందుకు కూడా స్థలం లేకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి హమాలీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా పని చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రచయిత మిట్టపల్లి సురేందర్,గాయకులు చుక్క రామ్ నర్సయ్య,హమాలీ సంఘ రాష్ట్ర అధ్యక్షులు గుంటి సామ్రాజ్యం,ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి,కార్మికులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హమాలీలు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

- విద్యార్థులు మంచిగా చదివి ఉన్నతంగా రాణించాలి.
- కేజీబీవిలో అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్త.
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.- రూ.2.30 కోట్లతో నూతన అదనపు తరగతి గదుల ప్రారంభం.



లోకల్ గైడ్/తాండూర్:విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తాండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మారేపల్లి



కేజీబీవిలో రూ.2.30 కోట్లతో అదనపు తరగతి గదులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగానే ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...విద్యర్థి దశలో ఏ పని మొదలు పెట్టిన నేను చేయగలను అనే నమ్మకంతో పని మొదలు పెట్టండి. విజయం మీ సొంతమవుతుందనీ అన్నారు. విద్యార్థి దశలోనే ఏ రంగంలో ఎదగాలనుకుంటున్నారో లక్ష్యంను నిర్ణయించుకోండి. ఏ రోజైతే మీ లక్ష్యంను సాదిస్తారో ఆ రోజు మీ బంధువులు, మీ స్నేహితులు, మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ సంతోషిస్తారు. అన్నింటికీ మించి మిమ్మల్ని గౌరవిస్తారు అని సూచించారు.ముఖ్యంగా విద్యార్థి దశలో పదవ తరగతి అనేది కేవలం ఒక పరీక్ష కాదు, మీ భవిష్యత్తుకు బలమైన పునాది. ఈ దశలో మీరు చూపే కృషి, క్రమశిక్షణ, పట్టుదల మీ భవిషత్తును నిర్ణయిస్తాయి తెలిపారు.పదవ తరగతి, ఇంటర్ పూర్తి అయినా వెంబడే డిగ్రీ, ఇంజనీరింగ్ అనేది కళల ప్రపంచం.ఆ కలలో ప్రపంచంలో అన్నిటికంటే ముఖ్యమైనది విద్య ఒక్కటే..క్రమశిక్షణ లేని చదువు ఎంత చదివినా వాసన లేని పుష్పం వంటిది.మన ప్రభుత్వం సంక్షేమాన్ని కేవలం మాటల్లో కాకుండా కార్యాచరణలో చూపుతుంది.ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ సంకల్పం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపుతో అధికారంలోకి వచ్చిన వెంబడే విద్యార్థుల ఆరోగ్యం కోసం మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి గుడ్లు, పాలు, పండ్లు వంటి పోషకాహారం అందేలా చర్యలు తీసుకున్నాం.ఇప్పుడు ఉన్న పోటీ ప్రపంచంలో మన పిల్లలు వెనుకబడకూడదనే ఉద్దేశంతో అన్ని ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోర్డులు, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్ పలు సదుపాయాలను బలోపేతం చేస్తున్నాం.అదేవిధంగా పాత భవనాల మరమ్మత్తులు, కొత్త భవనాల నిర్మాణం, తాగునీరు, కాంపౌడ్ వాల్స్, పరిశుభ్రత, విద్యుత్ వంటి మౌలిక వసతులకై అధిక నిధులు కేటాయిస్తున్నాం, వేగంగా అమలు చేస్తున్నాం అని స్పష్టం చేశారు.అనంతరం శ్రీ ఆర మైసమ్మ దేవాలయ 11వ వార్షికోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

**పాఠశాలలో వసతుల కల్పనకు కృషి.**

కేజీబీవీ పాఠశాలలో అవసరమైన వసతులు కల్పిస్తానని ఎమ్మెల్యే మనోహర్ స్పష్టం చేశారు.తప్పకుండా పాఠశాల ప్రహరీ గోడ,కిచెన్ రూము,టాయిలెట్స్ వంటి వాటిని త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మంగళి సునీత, కోట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజన్న, వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి,కాంట్రాక్టర్ శోభరాణి, ఎల్లారెడ్డి,లొంక నర్సింలు, మల్లేశం, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, కెపి రావు, విద్యాలయ ప్రిన్సిపల్ రాజేశ్వరి , ఉపాధ్యాయులు,విద్యార్థులు, అధికారులు, పలు గ్రామాల సర్పంచ్ లు, నాయకులు తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన 'జేఎస్ఆర్'



హుస్నాబాద్, మార్చి 15, లోకల్ గైడ్: హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి గ్రామానికి చెందిన నెట్యం మంజుల వెంకటేశ్వర్లు కుమార్తె అనూష దినేష్ బాబు ల వివాహం ఆర్ ఎం ఆర్ గార్డెన్స్ లో ఘనంగా జరిగింది. వీరి వివాహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, హుస్నాబాద్ నియోజకవర్గం ఇన్ ఛార్జ్ జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి( జేఎస్ ఆర్) హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిం చారు

## నేనున్నా...ఎవరు అధైర్యపడొద్దు కాంగ్రేస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి..




ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి మార్చి15(లోకల్ గైడ్ న్యూస్) :కాజీపేట 47వ డివిజన్‌లోని వరద ముంపు ప్రాంతం బూడిదగడ్డను కాంగ్రెస్ యువనాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆదివారం సందర్శించారు. స్థానిక ప్రజలతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, ప్రతి ఏడాది వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వరదల వల్ల ఇళ్లలోకి చేరే నీటి కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానికులతో చర్చించారు. కొంతమంది ఇళ్లలోకి స్వయంగా వెళ్లి పరిస్థితులను పరిశీలించిన ఆయన, రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థను కూడా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాలుగా బూడిదగడ్డ ప్రాంతాన్ని పూర్వ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రతి ఏడాది వర్షాలు పడితే ఇళ్లలోకి వరదనీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఇప్పటివరకు ఎవరూ వచ్చి సమస్యలను తెలుసుకోలేదని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు.ఈ ప్రాంతంలో వరదనీరు బయటకు వెళ్లాలంటే రైల్వే అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యను వెంటనే వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.దళారులను నమ్మొద్దు:ఇందిరమ్మ ఇండ్లు మరియు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల మంజూరులో ఎవరైనా దళారుల పేరుతో డబ్బులు అడిగితే నమ్మి మోసపోవద్దని విష్ణువర్ధన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇళ్ల మంజూరు పేరుతో డబ్బులు అడిగితే వెంటనే స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వంపై చెడ్డపేరు తీసుకువచ్చేలా ఎవరు ప్రవర్తించినా సహించబోమని హెచ్చరించారు. ఇది ప్రజా ప్రభుత్వం, కమీషన్ల ప్రభుత్వం కాదని ఆయన స్పష్టం చేశారు.ఈ పర్యటనలో స్థానిక డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్, నాయకులు ఇప్ప శ్రీకాంత్, దేవయ్య, సిరిల్ లారెన్స్, నగేష్, బర్ల రాజ్ కుమార్, తిరుపతి శ్రీనివాస్, రషీద్, వంశీ, దయాకర్ తో పాటు స్థానిక మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారబోయిన రవి కుమార్ యాదవ్

నాయకత్వంలో రానున్న కార్పొరేటర్ ఎన్నికలలో అత్యధిక స్థానాలలో విజయం సాధిస్తాం

హాఫీజ్ పేట బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మారబోయిన రవి కుమార్ యాదవ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా,హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో మసీద్ బండ బీజేపీ కార్యాలయంలో వారిని హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ నాయకులతో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసారు, ఈ సందర్భంగా హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ మాట్లాడుతూ..శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే , బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారబోయిన రవి కుమార్ యాదవ్ నాయకత్వంలో రానున్న కార్పొరేటర్ ఎన్నికలలో అసెంబ్లీలో అత్యధిక కార్పొరేటర్ స్థానాలలో విజయం సాధిస్తాం, బీజేపీ తిరుగులేని శక్తిగా అవతరించి, అవినీతి కాంగ్రెస్ , బీఆర్ఎస్ పాలనను అడ్డుకుంటాం అని అన్నారు, ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు కలివేముల మనోహర్, హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రావు, బీజేపీ జిల్లా గీతా సెల్ కన్వీనర్ రవి గౌడ్, హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్, హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ కార్యదర్శి రాజు యాదవ్, సుబ్బారావు, హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ నాయకులు మోహన్ ముదిరాజ్, రవి ముదిరాజ్, గంగుల అశోక్ నాయి, రాజ్ కుమార్, హాఫీజ్ పేట్ డివిజన్ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి బాలరాజు, హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ నాయకులు, నరసింహ, మల్లేష్, రాజేష్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ కేసులో కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పోలీసులు విచారణలో కీలక అంశాలు గుర్తించారు.బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సన్నిహితుడు కౌశిక్ రవి సిమ్లాలో డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.రోహిత్ రెడ్డి పీఏ శరత్ కుమార్ ఇచ్చిన సమాచారం ఆధారంగా కౌశిక్ రవిని పోలీసులు విచారిస్తున్నారు.రోహిత్ రెడ్డి డ్రైవర్ అర్జున్ రెడ్డి వద్ద డ్రగ్స్‌ను శరత్ కుమార్ పెట్టినట్లు పోలీసులు చెబుతున్నారు.ఫామ్‌హౌస్‌లో జరిగిన రాత్రి పార్టీలో పాల్గొన్న వారికి శరత్ కుమార్ డ్రగ్స్ పంపిణీ చేశాడని పోలీసులు తెలిపారు.మిగిలిన కొకైన్ కూడా శరత్ కుమార్ వద్దే ఉన్నట్లు గుర్తించారు.శరత్ కుమార్ వద్ద నుంచి రెండు ప్యాకెట్ల కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు.ఈ కేసులో ఇంకా పలువురిని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

# సెస్‌ల లక్ష్యం నీరుగారుతోందా?



కేంద్రం సెప్టెంబర్ 22 నుంచి కొత్త జీఎస్టీ శ్లాబులను అమలు చేస్తున్న నేపథ్యంలో సెస్‌లను సవ్యంగా ఉపయోగించుకోవడం పట్ల ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సెస్‌లు.. నిర్దిష్ట ప్రయోజనాల కోసం ప్రభుత్వం విధించే అదనపు పన్నులు. అయితే వీటి వినియోగంపై పారదర్శకత చాలా కాలంగా చర్చకు దారితీస్తోంది. విద్య, ఆరోగ్యం లేదా మౌలిక సదుపాయాలు వంటి ప్రజా సంక్షేమం కోసం నిధులకు ఉద్దేశించినవే ఈ సెస్‌లు. చాలా సేవలపై ప్రభుత్వం విధిస్తున్న సెస్‌లు వాటికి ఉద్దేశించిన ప్రయోజనాన్ని అందించడంలో విఫలమవుతున్నాయనే వాదనలున్నాయి.

### రాష్ట్రాలను పక్కదారి పట్టించే సాధనంగా..

ఇతర పన్నుల మాదిరిగా కాకుండా, ఆదాయశాఖ నియమాల ప్రకారం.. సెస్‌లు, సర్‌ఛార్జీలు రాష్ట్రాలతో పంచుకునేందుకు వీలుండదు. వీటిపై పూర్తి అధికారం కేంద్రానిదే. వాస్తవానికి దశాబ్దాల నుంచి సెస్‌లు వివిధ విభాగాల్లో పెరుగుతూ వస్తున్నాయి. 2018 అధ్యయనం ప్రకారం.. 1944 నుంచి 44 విభిన్న సెస్‌లను గుర్తించారు. 2017లో జీఎస్టీని ప్రారంభించినప్పుడు 26 సెస్‌లను రద్దు చేసి, ఉన్నవాటిలో కొన్నింటి రేట్లను పెంచారు. ఈ సెస్‌ల్లో రాష్ట్రాల ఆదాయ లోటును భర్తీ చేయడానికి సిన్ గూడ్స్, లగ్జరీ వస్తువులపై వసూలు చేసే పరిహార సెస్ (జీసీసీ) ఒక్కదాన్ని మాత్రమే రాష్ట్రాలతో పంచుకుంటున్నారు.

### పర్యవేక్షణ కరవు..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 270, 271 సెస్‌లను ప్రస్తావించినప్పటికీ వాటి వినియోగం అస్పష్టంగా ఉంది. సెస్‌ల నుంచి సమకూరే నిధులు కన్సాలిడేటెడ్ ఫండ్‌కు కాకుండా పబ్లిక్ అకౌంట్ ఆఫ్ ఇండియాకు వెళు_న్నాయి. ఈ యంత్రాంగం ద్వారా సెస్ నిధులను ఆయా విభాగాలు, విద్య, వైద్య?, ఇతర మౌలిక సదపాయాలు సృష్టించేందుకు కేటాయించాలి. కానీ బడ్జెట్ పరిశీలనలో వీటి ఊసే ఎత్తడం లేదనే వాదనలున్నాయి.

### ఆడిట్ చేయకపోతే అంతే సంగతులు..


కన్సాలిడేటెడ్ ఫండ్ కేటాయింపులతోపాటు పబ్లిక్ అకౌంట్ ఫండ్స్‌పై కఠినమైన పర్యవేక్షణ ఉండదనే అభిప్రాయాలున్నాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) ఆడిట్ చేయకపోతే వీటిపై అసలు రివ్యూనే చేయరని కొందరు భావిస్తున్నారు. ఇటీవల కాగ్ నివేదిక ఈ సమస్యను హైలైట్ చేసింది. 2024 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం సెస్‌లు, సర్‌ఛార్జీల నుంచి రూ.4.88 లక్షల కోట్లు సేకరించింది. ఇది స్థూల పన్ను ఆదాయంలో 14 శాతంగా ఉంది. అయితే ఇందులో రూ.3.57 లక్షల కోట్లు సెస్ ద్వారానే సమకూరింది. అయినప్పటికీ ఈ నిధులను నిబంధనల ప్రకారం ఉద్దేశించిన ప్రయోజనాల కోసం ఉపయోగించారా.. లేదా.. అనే దానిపై పారదర్శకత లోపించిందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. చమురుపై విధిస్తోన్న సెస్ ద్వారా 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.2.95 లక్షల కోట్లు సమకూరింది. అందులో కేవలం రూ.902 కోట్లు మాత్రమే చమురు పరిశ్రమ అభివృద్ధి నిధి కు బదిలీ చేశారు.




# మార్స్‌పై గతంలో జీవం!

## మరింత బలమైన ఆధారాలను గుర్తించిన నాసా రోవర్

కేప్ కనావెరల్(యూఎస్): అంగారకునిపై కోట్ల సంవత్సరాల క్రితం జీవం మనుగడ ఉండేదన్న వాదనలకు మరింత బలం చేకూరేలా అక్కడి నాసా 'పర్సివరెన్స్'రోవర్ ఒక శిలాజం ఆనవాళ్లను గుర్తించింది. వందల కోట్ల సంవత్సరాల క్రితం ప్రవహించి ఎండిపోయిన ఒక నది ఒడ్డున ఉన్న ఒక శిలపై ప్రత్యేకమైన గుర్తులను పర్సివరెన్స్ రోవర్ కనిపెట్టింది. భూమి మీద మాత్రమే కనిపించే కొన్ని ప్రత్యేక మూలకాల రసాయన, భౌతిక చర్యల కలయికగా ఏర్పడే 'లెపర్డ్‌స్పాట్స్' ను అక్కడ గుర్తించారు. ఆ గుర్తుల్లో అధిక ఇనుప ధాతువు జాడలున్నాయి. నీటి పీల్చుకున్న ఐరన్ ఫాస్ఫేట్(వివియనైట్), గ్రెగైట్(ఐరన్ సల్ఫైడ్)లను దానిపై కనిపెట్టారు. శిథిలమైన కర్బన పదార్థాల్లో వివియనైట్ ఉంటుంది. అలాగే చిన్నపాటి జీవులు సైతం గ్రెగైట్‌ను ఉత్పత్తిచేస్తాయి. ఈ లెక్కన ప్రాచీన జీవికి సంబంధించిన జాడగా ఈ 'లెపర్ట్ స్పాట్'ను భావించవచ్చని నాసా తాత్కాలిక అడ్మినిస్ట్రేటర్ సీన్ డఫీ వ్యాఖ్యానించారు.




# కంపెనీల్లో జెన్‌ఏఐ నిపుణుల కొరత..

- ప్రతి పదిమందిలో ఒక్కరికే అర్హతలు
- ప్రాంప్ట్ ఇంజినీరింగ్, ఏజెంట్ డిజైన్ నైపుణ్యాలకు డిమాండ్
- సీనియర్లకు రూ. 60 లక్షల వరకు ప్యాకేజీలు
- టీమ్‌లీజ్ డిజిటల్ సర్వే

న్యూఢిల్లీ: దేశీయంగా కృత్రిమ మేథ (ఏఐ) మార్కెట్ చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. 2025లో 28.8 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు నెలకొన్నాయి. కానీ నిపుణల కొరతే పరిశ్రమకు ప్రధాన సమస్యగా మారింది. పది జెన్‌ఏఐ ఉద్యోగాలుంటే నైపుణ్యాలున్న అభ్యర్థులు ఒక్కరే ఉంటున్నారు. టీమ్‌లీజ్ డిజిటల్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం నిర్దిష్ట ప్రాంప్ట్ ఇంజినీరింగ్, ఎల్‌ఎల్‌ఎం సేఫ్టీ..ట్యూనింగ్, ఏఐ ఆర్కెస్ట్రేషన్, ఏజెంట్ డిజైన్, సిమ్యులేషన్ గవర్నెన్స్, ఏఐ కాంప్లయెన్స్, రిస్క్ ఆపరేషన్స్‌లాంటి ఏఐ నైపుణ్యాలకు అత్యధిక డిమాండ్ ఉంటోంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు.. జనరేటివ్ ఏఐ ఇంజినీరింగ్, మెషిన్‌లెర్నింగ్ ఆపరేషన్స్‌లాంటి విభాగాల్లో కొత్త ప్రమాణాలు నెలకొల్పుతున్నాయి. సీనియర్లకు ఏటా రూ. 58-60 లక్షల వరకు ప్యాకేజీలు ఉంటున్నాయి.

### నివేదికలోని మరిన్ని విశేషాలు..

డిజిటల్ ఎకానమీలో ఏఐ, క్లౌడ్ ఉద్యోగాలకు డిమాండ్ భారీగా ఉంది. దానికి తగ్గట్లుగా నైపుణ్యాలున్న అభ్యర్థులు లభించక, తీవ్ర కొరత నెలకొంది. దీంతో తగిన అర్హతలున్న వారికి కంపెనీలు భారీ వేతనాలిస్తున్నాయి. జీసీసీల్లో సైబర్‌సెక్యూరిటీ, డేటా ఇంజినీరింగ్ ఉద్యోగుల వేతనాలు 2025-2027 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో వార్షికంగా వరుసగా రూ. 28 లక్షల నుంచి రూ. 33.5 లక్షలకు, రూ. 23 లక్షల నుంచి రూ. 27 లక్షలకు పెరగనున్నాయి. నాన్-టెక్ రంగాల్లోని టెక్ ఉద్యోగాలకు సంబంధించి ఐటీ సపోర్ట్, సంప్రదాయ తరహా సిస్టమ్స్ మెయింటెనెన్స్ విభాగాల్లో వేతనాలు వార్షికంగా రూ. 12 లక్షల స్థాయిలోనే స్థిరపడిపోయి ఉన్నాయి. పరిశ్రమ క్లౌడ్ నేటివ్, ఔట్‌సోర్స్‌డ్ సర్వీస్ మోడల్స్ వైపు మళు_తుండటాన్ని ఇది సూచిస్తోంది. ఏఐ మార్కెట్ ప్రస్తుతం హైపర్-గ్రోత్ దశలోకి అడుగుపెడుతోంది. ఏటా 45 శాతం వృద్ధితో 2025లో 28.8 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. అయితే, ప్రతిభావంతుల కొరత తీవ్రంగా ఉంటోంది. ప్రతి పది జెన్‌ఏఐ ఉద్యోగాలకు అన్ని అర్హతలు కలిగిన ఇంజినీరు ఒకే ఒక్కరు ఉంటున్నారు. 2026 నాటికి ఏఐ టాలెంట్ అంతరాలు 53 శాతానికి పెరగనుంది. అలాగే క్లౌడ్ కంప్యూటింగ్‌లో డిమాండ్-సరఫరా మధ్య అంతరం 55-60 శాతానికి పెరగనుంది. ఉద్యోగులకు కొత్త నైపుణ్యాల్లో పెద్ద స్థాయిలో శిక్షణను కల్పించకుంటే, కంపెనీల వృద్ధి ఆకాంక్షలు నెరవేరని పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ఏఐ వినియోగమనేది జాబ్ మార్కెట్ల రూపురేఖలను గణనీయంగా మార్చేయనుంది. గ్లోబల్ విధులు నిర్వహించే 40 శాతం వరకు ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఐటీ సర్వీసులు, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, బీఎఫ్‌ఎస్ఐ, హెల్త్‌కేర్‌లాంటి రంగాల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. అందుకే కంపెనీలు ఏఐ%-%ఫస్ట్ లెర్నింగ్ మోడల్స్, డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. భారత డిజిటల్ ఎకానమీలో ఉద్యోగాలు, నైపుణ్యాల్లో మార్పులకు ఇంజిన్లుగా వ్యవహరిస్తున్న జీసీసీలు, ఉద్యోగాల కల్పనకు సారథ్యం వహిస్తున్నాయి. 2025లో 22-25 శాతం మేర ఉద్యోగాలు కల్పించనున్నాయి. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ విభాగాల్లో అత్యధికంగా కొలువులు ఉండనున్నాయి. 2027లో అందుబాటులోకి రాబోయే 47 లక్షల కొత్త టెక్ ఉద్యోగాల్లో గణనీయ సంఖ్యలో కొలువులను (12 లక్షలు) జీసీసీలే కల్పించనున్నాయి. ప్రధానంగా జెన్‌ఏఐ, ఇంజినీరింగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఈ ఉద్యోగాలు ఉంటాయి. జీసీసీలు మెట్రో పరిధిని దాటి విస్తరిస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో 1,30,000-1,40,000 మంది తాజా గ్రాడ్యుయేట్లను రిక్రూట్ చేసుకోనున్నాయి. వీరిలో ఎక్కువ శాతం హైరింగ్ ద్వితీయ, తృతీయ శ్రేణి ఇంజినీరింగ్ క్యాంపస్‌లలో ఉండొచ్చు. వైవిధ్యానికి కూడా ప్రాధాన్యం పెరుగుతోంది. ఇప్పుడు టాప్ 20 జీసీసీల్లో 40 శాతం మంది సిబ్బంది మహిళలే ఉంటున్నారు. పరిశ్రమ సగటు కన్నా ఇది 1.5 రెట్లు అధికం. 2027 నాటికి భారత్‌లో 2,100 పైగా జీసీసీలు ఉంటాయి. వీటిలో 30 లక్షల మంది పైగా ఉంటారు.




# ఏఐకి మహిళా టెకీల జై..



## మెరుగైన అవకాశాలు కల్పిస్తుందని భరోసా
## నైపుణ్యాల్లో శిక్షణపై మరింతగా దృష్టి
## అప్నాడాట్‌కో నివేదిక

ముంబై: మెరుగైన అవకాశాలను దక్కించుకునేందుకు కృత్రిమ మేథ (ఏఐ) ఉపయోగపడుతుందని టెక్నాలజీ రంగంలో అత్యధిక శాతం మహిళలు విశ్వసిస్తున్నారు. జాబ్స్, కెరియర్ ప్లాట్‌ఫాం అప్నా డాట్‌కో నిర్వహించిన సర్వేలో 78 శాతం మంది ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. దీని ప్రకారం మహిళా టెకీలు ఏఐ ఆధారిత కెరియర్ల కోసం సన్నద్ధమవుతున్నారు. 58 శాతం మంది ఇప్పటికే ఉద్యోగాల్లో భాగంగానో లేదా ఏదైనా ప్రోగ్రాంలలో చేరడం ద్వారానో లేక స్వయంగానో ఏఐ/ఎంఎల్ నైపుణ్యాల్లో శిక్షణ పొందుతున్నారు. 24 శాతం మంది త్వరలోనే శిక్షణ పొందే యోచనలో ఉన్నారు. టెక్నాలజీ రంగంలో పని చేస్తున్న 11,300 మంది మహిళలు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఇందులో అత్యధిక భాగం మహిళలు జెన్ జెడ్ విభాగానికి (పాతికేళ్ల లోపు వారు) చెందినవారే. వీరిలో 60 శాతం మంది ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు చెందిన వారు కాగా, మూడింట రెండొంతుల మంది సాధారణ కాలేజీల్లో చదివినవారే.




### ఏఐ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌కి డిమాండ్..

సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు సగం మంది ఏఐ సాఫ్ట్‌వేర్ డెవలపర్లు కావాలనుకుంటున్నారు. అలాగే 19 శాతం మంది డేటా సైన్స్.. మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), 14 శాతం మంది ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్, 10 శాతం మంది రీసెర్చ్ ఉద్యోగాలపై దృష్టి పెడుతున్నారు. దీన్ని బట్టి చూస్తే ఏఐని ఏదో ఆషామాషీ ట్రెండ్‌గా కాకుండా సమాన అవకాశాలను కల్పించే దోహదకారిగా మహిళా టెకీలు భావిస్తున్నట్లు తెలుస్తోందని అప్నాడాట్కో వ్యవస్థాపకుడు నిర్మిత్ పారిఖ్ తెలిపారు. మరోవైపు, ఇప్పుడు పేరొందిన కాలేజీ నుంచి పట్టా పొందడం కన్నా ఏఐలో నైపుణ్యాలే చాలా ముఖ్యమని మూడింట రెండొంతుల టెకీలు భావిస్తున్నారు. జెన్ జెడ్ అమ్మాయిల్లో (22-25 ఏళ్ల వయస్సున్న వారిలో 62 శాతం మంది), ద్వితీయ-తృతీయ శ్రేణి పట్టణాల్లోని మహిళల్లో (74 శాతం మంది) ఈ భావన అత్యధికంగా ఉంది. మెట్రోల్లో ఇది 66 శాతం మందిలో ఉంది. ఏఐని అందిపుచ్చుకోవడంలో ఎదురవుతున్న సవాళ్ల విషయానికొస్తే.. నాణ్యమైన అవకాశాలు అందుబాటులో ఉండటం లేదని 42 శాతం మంది, బలమైన మెంటార్‌షిప్ లేదని 27 శాతం, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఆప్షన్లు అవసరమని 19 శాతం మంది తెలిపారు.

# దక్షిణాదిన తొలి 'హంటర్‌హుడ్' ఫెస్టివల్!

## చెన్నైలో నిర్వహించిన రాయల్ ఎన్‌ఫీల్డ్
## ఆకట్టుకున్న హంటర్ 350 గ్రాఫైట్ గ్రే వేరియంట్
## కుర్రకారు కేరింతలతో డీజే, లోకల్ ర్యాప్ స్టార్స్ సందడి
## స్కేట్‌బోర్డింగ్, స్ట్రీట్ ఆర్టిస్టుల హల్‌చల్




దుగ్గు దుగ్గు బండిపై 'బుల్లెట్'లా దూసుకెళ్తున్న కుర్రకారు స్ట్రీట్ కల్చర్‌లోనూ దుమ్మురేపుతున్నారు. అందుకే, బుల్లెట్ బండి అంటే ఠక్కున గుర్తొచ్చే రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇప్పుడు ఈ లోకల్ ఆర్టిస్టులకు దన్నుగా నిలుస్తోంది. అర్బన్ రైడర్ల కోసం ప్రత్యేకంగా మలిచిన 'హంటర్ 350' బైక్ స్ఫూర్తితో 'హంటర్‌హుడ్' వేడుకలకు తెరతీసింది. దక్షిణాదిన ఈ తొలి ఫెస్టివల్‌ను తాజాగా చెన్నైలో నిర్వహించింది. బెంగళూరుకు చెందిన ప్రముఖ డీజే బెంకీ బేకు... క్రేజీ రీమిక్స్‌లతో ఈవెంట్‌ను ఆరంభించారు. స్ట్రీట్ ఆర్టిస్ట్‌లు వేసిన బైకింగ్ పెయింటింగ్‌లు అబ్బురపరిచాయి. మరోపక్క, స్కేట్‌బోర్డింగ్ మ్యూజిక్ కలగలిపి సాగిన ఈవెంట్ మరో హైలైట్. స్థానిక తీన్మార్ డప్పుల దరువుకు సింగర్లు పాడిన లోకల్ పాటలు వేరే లెవెల్. లోకల్ హిప్‌హాప్ సింగర్స్ ఇక్కీ బెర్రీ, అసల్ కోలార్, ఆరీవు తదితరుల తమిళం, ఇంగ్లీష్ ర్యాప్ సాంగ్స్‌తో ఇక్కడి ఐలాండ్ గ్రౌండ్ మొత్తం దద్దరిల్లింది. ఇక డ్యాన్సర్లు కూడా బీట్‌కు అనుగుణంగా క్రేజీ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. విభిన్న ఆర్టిస్టులు ఈవెంట్ ఆసాంతం స్ట్రీట్ కల్చర్ వైబ్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

### ఏప్రిల్‌లో తొలిసారి...

ఈ ఏడాది ఏప్రిల్‌లో తొలిసారిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ 'హంటర్‌హుడ్' ఫెస్టివల్‌ను ఒకేసారి ఢిల్లీ, ముంబై నగరాల్లో నిర్వహించింది. ఈ సందర్భంగా 'హంటర్ 350' 2025 ఎడిషన్‌ను రియో వైట్, టోక్యో బ్లాక్, లండన్ రెడ్ తదితర రంగుల వేరియంట్లలో ఆవిష్కరించింది. ఆధునిక రెట్రో లైఫ్‌స్టయిల్ కోరుకునే నవతరం యువతను ఆకట్టుకునేలా స్టయిల్, వినోదం, దూకుడును కలగలిపి హంటర్ 350 బైక్‌ను మలిచామని రాయల్డ్ ఎన్‌ఫీల్డ్ చెబుతోంది. మరోపక్క, హిప్‌హాప్, ర్యాప్, స్ట్రీట్ డ్యాన్స్, స్కేట్‌బోర్డింగ్‌లలో లోకల్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ... స్ట్రీట్ కల్చర్‌కు దన్నుగా నిలవడమే 'హంటర్‌హుడ్' ఫెస్టివల్ ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. క్రమంగా మరిన్ని నగరాల్లోనూ ఈ వేడుకలను నిర్వహించే ప్రణాళికల్లో కంపెనీ ఉంది.

### గ్రాఫైట్ గ్రే.. సూపర్బ్

హంటర్ 350లో కొత్తగా ప్రవేశపెట్టిన గ్రాఫైట్ గ్రే వేరియంట్‌ను చెన్నై హంటర్‌హుడ్ ఫెస్టివల్‌లో ఎన్‌ఫీల్డ్ ప్రత్యేకంగా ప్రదర్శించింది. ఇప్పటికే యూత్‌కు బాగా కనెక్ట్ అవుతున్న హంటర్ బైక్.. ఈ సరికొత్త షేడ్‌తో మరింత ఆకట్టుకుంటోంది. బైకింగ్ యాక్సెసరీలు, లైఫ్‌స్టయిల్ గేర్‌తో పాటు ట్రెండింగ్‌లో ఉన్న స్ట్రీట్ వేర్ ఉత్పత్తులను కూడా ఈ సందర్భంగా వివిధ బ్రాండ్‌లు తమ స్టాల్స్‌లో ప్రదర్శించాయి. కాగా, 350సీసీ లోపు బైక్‌లపై జీఎస్టీ రేటును ఇప్పుడున్న 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించిన నేపథ్యంలో (ఈ నెల 22 నుంచి అమలు) ఎన్‌ఫీల్డ్ హంటర్‌పై గరిష్టంగా రూ.22,000 తగ్గింపును ప్రకటించిన సంగతి తెలిసిందే.

# రిలయన్స్ ఇంటెలిజెన్స్ షురూ

## సొంత అనుబంధ సంస్థగా ఏర్పాటు
## రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా వెల్లడి




న్యూఢిల్లీ: రిలయన్స్ ఇంటెలిజెన్స్ పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సేవల కంపెనీకి తెరతీసినట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా వెల్లడించింది. పూర్తి అనుబంధ కంపెనీగా ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఇందుకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ నుంచి సర్టిఫికెట్‌ను పొందినట్లు తెలియజేసింది. గత నెలలో నిర్వహించిన వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) లో కొత్తగా ఏఐ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ వాటాదారులకు వెల్లడించిన సంగతి తెలిసిందే. తద్వారా భారీస్థాయి ఏఐ మౌలిక సదుపాయాలకు తెరతీయనున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ టెక్ దిగ్గజాలు మెటా, గూగుల్‌తో కొత్త భాగస్వామ్యాలను సైతం ప్రకటించారు.గిగావాట్ సామర్థ్యంతో రిలయన్స్ ఇంటెలిజెన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌ఐఎల్ ఇప్పటికే వెల్లడించింది. గ్రీన్ ఎనర్జీ మద్దతుతో ఏఐ-రెడీడేటాసెంటర్లతో నెలకొల్పుతున్నట్లు తెలియ జేసింది. దశాబ్దంక్రితం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు డిజిటల్ సర్వీసులు గ్రోత్ ఇంజిన్‌గా నిలవగా.. ఇకపై ఏఐతో మరింత పురోభివృద్ధిని అందుకో నున్నట్లు ఏజీఎంలో ముకేశ్ పేర్కొన్నారు.

## పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సిద్ధిపేట జిల్లా ప్రతినిధి మార్చి15(లోకల్ గైడ్ తెలంగాణ) ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని మైత్రి వనంలో గల వెనుకబడిన అభివృద్ధి శాఖ మరియు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రాత్రి భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వివిధ శాఖల వసతిగృహాలు ఒకే భవనంలో వేర్వేరు అంతస్తుల్లో నిర్వహించబడుతున్నందున బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని వార్డెన్లకు సూచించారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట సరుకులను కొలతల ప్రకారం అందించి, రోజువారీ కామన్ డైట్



మెనూను పాటిస్తూ రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు.వంటగది పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్, అక్కడే సిబ్బందితో శుభ్రపరిచే పనులు చేయించారు. ఎల్లప్పుడూ వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని వంట సిబ్బందికి సూచించారు.స్టోర్ రూమ్‌లో సరుకులను తనిఖీ చేసిన కలెక్టర్, నాణ్యమైన ఆహార పదార్థాలనే వినియోగించాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని వార్డెన్లను హెచ్చరించారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న యువనేత అభిమన్యు రెడ్డి.




జడ్చర్ల మార్చ్ 15 లోకల్ గైడ్.జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండల కేంద్రంలోని మాజీ వార్డు మెంబర్ కర్నెకోట రాజేష్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ పార్టీ యువనేత చించోడు అభిమన్యు రెడ్డి. వారితో పాటు పలువురు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువసేన సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఔదార్యం
## పాఠశాల పైకప్పు నిర్మాణానికి ముందుకొచ్చిన శ్రీరామ్

:ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం ముదిగుబ్బ మండలం దొరిగల్లులో ఓ వివాహ వేడుకకు శ్రీరామ్ హాజరయ్యారు. అదే సమయంలో ఆయన గ్రామంలో వెళ్తున్నప్పుడు ప్రభుత్వ పాఠశాల వద్ద 10 వ తరగతి విద్యార్థులు చెట్ల కింద కూర్చుని చదువుకుం టుండటం గమనించారు. ఎందుకు మీరంతా చెట్ల కింద ఉన్నారని ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆరా తీయగా పాఠశాలలో భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని వారు సమాధానం ఇచ్చారు. వెంటనే శ్రీరామ్ పాఠశాలను పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022-24 సమయంలో నాడు-నేడు కింద పాఠశాల నూతన భవనాల నిర్మాణాలు చేపట్టారన్నారు. అయితే అప్పట్లో కేవలం గోడలు మాత్రమే నిర్మించి వదిలేశారన్నారు. 160మంది పిల్లలకు కేవలం నాలుగు గదులే ఉన్నాయని అవి కూడా అసంపూర్తిగా నిలిచిపోయా యన్నారు. గత మూడేళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు అన్నారు. ఫోన్ ద్వారా విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. నూతన భవనాల నిర్మాణం ప్రతిపాదనలో ఉందని చెప్పారు. దీంతో శ్రీరామ్ వెంటనే తన సొంత ఖర్చులో పై కప్పు నిర్మిస్తానని గ్రామస్థులకు, విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పాఠశాలకు నిధులు కూడా వచ్చేలా కృషి చేస్తానన్నారు. వెంటనే పైకప్పు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీరామ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీ రాములు జయంతి వేడుకలు



Amarajeevi Potti SriRamulu Garu
Date of Birth 16-03-1901, Athmarpanam 15-12-1952

నేడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. జిల్లాలోని నియోజకవర్గ విజన్ యూనిట్ లలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల కార్యక్రమం నిర్వహించా లన్నారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా రాజధాని అమరావతి తుళ్లూరు నందు అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుతో 58 అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారన్నారు. జిల్లాలోని ప్రధాన కార్యస్థానంలో జడ్పీ సమావేశ మందిరం నందు, నియోజకవర్గ విజన్ యూనిట్ లలో రాష్ట్ర ముఖ్యమంత్రి గారి లైవ్ కార్యక్రమం వీక్షణ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సీఎం లైవ్ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతపురం నగరంలో జిల్లా పరిషత్ లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల

# నేతలకు ప్రియనేస్తం.. ప్రజలకు అభయహస్తం ఎమ్మెల్యే శంకరన్న.

నియోజకవర్గంలో రెండున్నరేళ్లలోనే రూ.1389.70 కోట్ల ప్రగతి.

ఘనంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలు .

అనతి కాలంలోనే అద్భుత ప్రగతితో తనదైన ముద్ర వేసుకొన్న ఎమ్మెల్యే శంకర్.

సర్కారుపై ఆధారపడకుండా షాద్ నగర్ లో నూతన కళాశాల భవన నిర్మాణం.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా ఏకృత పాఠశాలకు శ్రీకారం





రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): ఆరంభం నుంచి మొదలుపెట్టి ఐదేళ్ల పాలనలో అర భాగం పూర్తయిన ఇప్పటిదాకా నిరంతరం ప్రజల్లోనే ఉంటూ అభివృద్ధే లక్ష్యం గా తనదైన ముద్ర వేసుకొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం నియోజకవర్గంలో అంబరాన్ని ఉంటాయి. పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా ముందుకు సాగుతూ ఇక మున్సిపాలిటీలను, అటు మండలాల వారీగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆయన పనితనానికి గుర్తుగా ఎన్నెన్నో ప్రగతి కార్యక్రమాలు.. ఆయన నిబద్ధతకు గుర్తుగా ప్రభుత్వంతో సంబంధం లేకుండానే ప్రజా ప్రయోజనకర నిర్మాణాలు రెండున్నర ఏళ్ల పాలనలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకత అద్దం పడుతుంది.

### నిత్య కృషివలుడు మన శంకరన్న.

నందిగామ మండల పరిధిలోని వీర్లపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబంలో జన్మించిన అయన తాను పుట్టిన గ్రామం.. తన తల్లిదండ్రులు.. తన జీవితాన్ని చూసి గర్వపడ్డాడు.. తను ఎలాగైనా సరే ప్రజా సేవలోకి అడుగుపెట్టాలని కలలుగని ఆ కలలను సాకారం చేసుకోనేందుకు ముందుకు సాగాడు. కళాశాల కోసం పది కిలోమీటర్లు ఉన్న షాద్ నగర్ కు నడుచుకుంటూ వచ్చాడు. చదువులు పూర్తి చేసుకొని ఒక సాధారణ కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీలో చేరి తన రాజకీయ ప్రస్తానాన్ని మొదలుపెట్టాడు. అదే క్రమంలో గ్రామ సర్పంచ్ గా పోటీ చేసి విజయాన్ని సాధించి తొలి అడుగు వేశాడు.

### ఎమ్మెల్యే గిరిపై గురి.... ఆ దిశగా సాధన పెట్టాడు

ఎస్సీ రిజర్వుడుగా ఉన్న షాద్ నగర్ నియోజకవర్గం 2009లో జనరల్ గా మారింది. అప్పటినుంచి ఎమ్మెల్యేగా టికెట్ దక్కించుకొని పోటీ చేయాలన్న సంకల్పం వీర్లపల్లి శంకర్ లో పెరిగింది. నాడు అప్పటి పోటీలో ఉన్నప్పటికీ అవకాశం చౌలపల్లి ప్రతాప్ రెడ్డిని వరించింది. దానికి ఆయన కృంగిపోలేదు. మరో అవకాశం కోసం ఎదురు చూశారు.. 2014లోనూ ఇదే పరిస్థితి.. మళ్లీ ఎదురుచూపులు.. బీఆర్ఎస్ వైపు అడుగులు.. 2018లో అక్కడ కూడా నిరాశే. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా బీఎస్పీ తరఫున పోటీ చేసి ప్రత్యర్థులకు చెమటలు పట్టించాడు. 27 వేలకు పైగా ఓట్లను సాధించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. ఆ తర్వాత కీలక నాయకులందరూ కాంగ్రెస్ ను వీడి బీఆర్ఎస్ వైపు అడుగులు వేసిన తరుణంలో తాను మాత్రం కష్టాల్లో ఉన్న కాంగ్రెస్ పగ్గాలను పట్టుకొని ఎదురీత ఈ దాదు. వెనక్కి వెళ్ళిపోయిన వారందరినీ మళ్లీ తీసుకువచ్చి కాంగ్రెస్ అభిమానులందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చి పార్టీకి జీవం పోసి పూర్వ వైభవం తెచ్చాడు.

### ఆదరబెదరక నిలిచాడు.. ఆపై గెలిచాడు.

కాంగ్రెస్ పార్టీ ఒక తాటి మీదకి తెచ్చి పార్టీకి పూర్వ వైభవం ఇచ్చిన ఎమ్మెల్యే శంకర్ వైపు కాంగ్రెస్ అధిష్టానం మొగ్గుచుపింది. అతని సేవలను గుర్తించి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ప్రత్యర్థి అప్పటికే రెండుసార్లు ఘనవిజయం సాధించిన అంజయ్య యాదవ్. కాంగ్రెస్ పార్టీలో శంకర్కు టికెట్ ఇవ్వడం ఇష్టం లేని ప్రస్తుత ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్ ఇలాంటి చాలామంది పార్టీని వీడి వెళ్లిపోయారు. అయితే తన వ్యూహాలతో అంచలంచలుగా ముందుకు సాగి మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి ఇలాంటి వాళ్లను పార్టీలోకి తెచ్చుకొని పట్టువదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నం మొదలుపెట్టాడు. ఊరూరా తిరిగి తన వాణిని ప్రజల ముందు ఉంచాడు. అనుకున్న ఫలితాన్ని సాధించాడు. హోరాహోరీగా జరిగిన పోరులో 7వేల పైచిలుకు ఓట్లతో ఘన విజయం సాధించాడు.షాద్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొలువు తీరాడు. పట్టుదల ఉంటే కలలను సాకారం చేసుకోవచ్చని చెప్పిన అబ్దుల్ కలాం మాటలను అక్షరసత్యంగా మలిచాడు.. పదవితోపాటు హృదయాలను కూడా గెలిచాడు..

### అభివృద్ధి కృషి వలుడు మన శంకర్.

ఇక పాలన విషయానికి వస్తే మొదటి అడుగు నుంచే తనదైన ముద్ర వేసి భేష్ అనిపించుకున్నాడు. అధికారంలోకి రాగానే అర్ధాంతరంగా ఆగిపోయిన పాత జాతీయ రహదారి విస్తరణ పనులను పూర్తి చేసి తన ముద్రవేశాడు. సాక్షాత్తు ముఖ్యమంత్రిని తీసుకువచ్చి కొందుర్గులో ఏకీకృత పాఠశాల కు శ్రీకారం చుట్టేలా చేశాడు. అంతేకాదు అందరినీ ఆశ్చర్యపరుస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి చందాలు పోగు చేయడంతో పాటు, తన సొంత డబ్బులతో పెద్ద ఎత్తున అత్యధునిక భవన నిర్మాణం చేపడుతున్నాడు. ఇది ప్రస్తుతం రానున్న విద్యా సంవత్సరం కోసం వేగంగా ముస్తాబవుతుంది. మొత్తం ఇప్పటిదాకా రెండున్నర ఏళ్లలో 13 89.70 కోట్లు వివిధ అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశాడు.40.20 కోట్లతో సిసి రోడ్లు,, డ్రైనేజీలు,12.70 కోట్లతో కొందుర్గు మండలానికి మినీ స్టేడియం, 184 కోట్లతో చటాన్పల్లి గేటు వద్ద ఫ్లైఓవర్ వంటివి చేయడంతో పాటు ఇటీవలనే రూ. 8 కోట్లతో డబుల్ బెడ్ రూమ్ లట వద్ద పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయించి లబ్ధిదారులకు అందజేశారు. ఇక గ్రామీణ రహదారులను బాగు చేసేందుకు వివిధ శాఖల కింద రూ.54.35 కోట్లు మంజూరు చేయించారు. కస్తూర్బా పాఠశాలలు, గ్రామపంచాయతీ భవనాల మరమ్మతులకు, నిర్మాణాలకు రూ.6.94కోట్లు మంజూరు చేశారు. ఇవి కాకుండా దేవాలయాల అభివృద్ధికి 1.7 కోట్లు, పార్కులు, వంతెనల అభివృద్ధికి రూ.84 కోట్లు, పీహెచ్సీ లభివృద్ధికి రూ. 11 కోట్లు, జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి 10 కోట్లు, పాలిటెక్నిక్ కళాశాల భవనానికి రూ.27.50కోట్లు, గిరిజన శాఖ, ఇరిగేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.19.87 కోట్లు, ఆర్ అండ్ బి శాఖ ద్వారా రహదారులకు రూ.98 కోట్లు మంజూరు చేయించారు. అదేవిధంగా అదనపు నిధులతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, కళాక్షేత్రం నిర్మాణం వంటి కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఇక నియోజకవర్గంలో ఫరూక్నగర్, మొగిలిగిద్ద గ్రామాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. తాను ఏది అనుకున్న అంకితభావంతో పనిచేస్తూ ముందుకు సాగిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజల హృదయాలలో తనదైన ప్రత్యేకముద్ర వేశారు.

# జన గణన 2027 పథకాల అమలు, దేశ అభివృద్ధికి కీలకం:రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ

- జన గణన 2027 పై జిల్లా అధికారులు,ఛార్జ్ అధికారులకు శిక్షణ



మహబూబ్ నగర్ 15 మార్చి (లోకల్ గైడ్ ప్రతినిధి జీవి గౌడ్) ప్రభుత్వ పథకాల రూపకల్పన, అమలు, దేశాభివృద్ధికి జన గణన 2027 కీలకమని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ అన్నారు.జన గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమం అవగాహన కలిగిస్తుందనిఅన్నారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జన గణన2027 నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు(ఛార్జ్ అధికారులు) 3 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జన గణన 2027 సమర్థమంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.జన గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్,హౌస్ ఎన్యూమరేషన్), గృహాల గణన నిర్వహించబడుతుందని, తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుంది. రెండవ దశలో జనాభా గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు.ఈసారి జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అంటే ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణం (కచ్చా పక్కా,తదితర,) ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా ప్రతి మండలంలోని రెవెన్యూ గ్రామాలను, పట్టణాల్లోని వార్డులను గణన బ్లాకులుగా ఎలా విభజించాలి, గణన ప్రక్రియను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి రవీందర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖల అధికారుల బాధ్యతలను వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఛార్జ్ అధికారులుగా గ్రామీణ ప్రాంతంలో మండలం లో తహశీల్దార్,పట్టణ ప్రాంతం లో మున్సిపల్ కౌన్సిల్ ఉన్న పట్టణాల్లో కమిషనర్,కార్పొరేషన్ లో డిప్యూటీ కమిషనర్ ఉంటారని తెలిపారు.ఎన్యూమరేట్ లుగా సెకండరీ టీచర్ లు,క్లర్క్ లు,ఇతర అధికారులు ఉంటారని,ఎన్యూమరేట్ పై వారు సూపర్వైజర్ లుగా ఉంటారని అన్నారు.జిల్లా మాస్టర్ ట్రైనర్ లు బాలు యాదవ్,శ్రీకాంత్ ఫీల్డ్ ట్రైనర్ లకు శిక్షణ నివ్వనున్నారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని డైరెక్టరేట్జ ఆఫ్ ప్లానింగ్ శాఖ ఏ డి.రాజు,గణాంక అధికారి షేక్ సుల్తాన్ అలీ లు,. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జన గణన,హౌస్ లిస్టింగ్,ఎన్యూమరేషన్ చేయడం శిక్షణ లో అవగాహన కలిగించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ,ఇంచార్జి డి.పి.ఓ వెంకట రెడ్డి సి.పి.ఓ రవీందర్,డి.ఈ.ఓ ప్రవీణ్ కుమార్, ఆర్డీఓ నవీన్ మునిసిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంబాద్‌లో చిరుతల మహాభారతం నాటక ప్రదర్శనలు -మార్చి 23 నుంచి 31 వరకు ఐదు రోజుల సాంస్కృతిక మహోత్సవాలు




హన్వాడ, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ చిరుతల మహాభారతం నాటక ప్రదర్శనలు వైభవంగా నిర్వహించనున్నారు. స్వస్తిశ్రీ పరభవనామ సంవత్సర చైత్ర శుద్ధ పంచమి సందర్భంగా 2026 మార్చి 23 సోమవారం నుండి 2026 మార్చి 31 మంగళవారం వరకు ఐదు రోజులపాటు ఈ నాటక ప్రదర్శనలు జరగనున్నాయి. పంచరంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన వేదికపై అతిమధురమైన రాగాలతో శ్రీ శివరామాంజనేయ భజన బృందం ఈ మహాభారత నాటకాన్ని ప్రదర్శించనుంది. ఈ కార్యక్రమానికి వివిధ ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ముఖ్య అతిథులుగా డి.కె.అరుణ (ఎంపీ మహబూబ్‌నగర్), యెన్నం శ్రీనివాస్ రెడ్డి (ఎమ్మెల్యే), వి.శ్రీనివాస్ గౌడ్ (మాజీ మంత్రి), జి.మమత (చైర్మన్ మున్సిపల్ కార్పొరేషన్ మహబూబ్‌నగర్), ఎం. సురేందర్ రెడ్డి (వైస్ చైర్మన్ మున్సిపల్ కార్పొరేషన్ మహబూబ్‌నగర్), సంజీవ్ ముదిరాజ్ (డీసీసీ ప్రెసిడెంట్ మహబూబ్‌నగర్), బి. యాదయ్య (సర్పంచ్), ఎ. కేశవులు (ఉపసర్పంచ్) పాల్గొననున్నారు. మొదటి రోజు-మార్చి 23 (సోమవారం):కౌరవులు, పాండవుల ప్రవేశం, బంతియాట, బంతి నూతిలో పడటం, ద్రోణాచార్యుడు బంతిని వెలికి తీయడం, విలువిద్యలు బోధించడం, గురుదక్షిణగా ద్రుపదరాజును తెచ్చే ఘటనలు, దుర్యోధనుడి అసూయతో పాండవులను వారణావతికి పంపడం, భీముడు హిడింబాసురుని సంహరించడం వరకు కథ కొనసాగుతుంది. రెండవ రోజు-మార్చి 25 (బుధవారం):పాండవులు ఏకచక్రపురంలో బిక్షాటన, భీముడు బకాసురుని సంహరించడం, ద్రుపద మహారాజు మత్స్యయంత్రాన్ని ఛేదించిన వారికి ద్రౌపదిని వివాహం చేయనున్నట్టు ప్రకటించడం, అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించడం, పాండవులు-ద్రౌపది వివాహం, అర్జునుని తీర్థయాత్రలు, బలరామ-కృష్ణుల ప్రవేశం, అగ్నిదేవుడు అర్జునునికి దివ్యరథం గాండీవం ఇవ్వడం వంటి ఘటనలు ఉంటాయి. మూడవ రోజు-మార్చి 27 (శుక్రవారం): జరాసంధుడి ప్రవేశం, భీముడు జరాసంధుని సంహరించడం, ధర్మరాజు రాజసూయ యాగం, శకుని మాయజూదంలో పాండవుల పరాభవం, ద్రౌపది చీరహరణం, శ్రీకృష్ణుడు రక్షించడం, శివుడు కిరాతరూపంలో అర్జునుని పరీక్షించడం, పశుపతాస్త్రం ప్రసాదించడం, దేవేంద్రుడు అర్జునునికి మణికిరీటం ఇవ్వడం వరకు కథ కొనసాగుతుంది. నాల్గవ రోజు- మార్చి 29 (ఆదివారం):సౌగంధిక పుష్పం కోసం అరణ్యంలోకి వెళ్లిన భీముడు, ఆంజనేయుడు మార్గదర్శనం, చిత్రసేన గంధర్వుడు దుర్యోధనుడిని బంధించడం, అర్జునుడు విడిపించడం, మత్స్యదేశంలో అజ్ఞాతవాసం, కీచకుడు ద్రౌపదిని వేధించడం, భీముడు కీచకుని సంహరించడం, అర్జునుడు గోవులను తిరిగి తెచ్చే యుద్ధం వరకు ప్రదర్శించబడుతుంది. ఐదవ రోజు-మార్చి 31 (మంగళవారం): శ్రీకృష్ణుడు రాయభారంగా ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్లడం, కౌరవులు ఒప్పుకోక యుద్ధం ప్రారంభం కావడం, అర్జునుడు యుద్ధం చేయలేక వెనుదిరిగిన సమయంలో శ్రీకృష్ణుడు విశ్వరూపం చూపించడం, అనంతరం కురుక్షేత్ర యుద్ధం, అర్జునుడు భీష్మ, ద్రోణాచార్యులు, కర్ణుడు, అశ్వద్ధాములను సంహరించడం, భీముడు దుశ్శాసనుడు, దుర్యోధనుడిని సంహరించడం, చివరగా ధర్మరాజు పట్టాభిషేకంతో కథ ముగుస్తుంది. పాత్రలు- పాత్రధారులు: దుర్యోధనుడు- సి.వెంకటయ్య, దుశ్శాసనుడు- ఎస్.స్వరూప రెడ్డి, కర్ణుడు-జి. నర్సిములు గౌడ్, చిత్రసేన గంధర్వుడు-అంజిలయ్య, ధర్మరాజు-సి.భీమయ్య, భీముడు-ఎ.కిష్టయ్య, అర్జునుడు-కె.అంజిల్ రెడ్డి (బాబు), నకులుడు-వై. వెంకటయ్య, సహదేవుడు- యాదయ్య పాలమూరు, ద్రోణాచార్యుడు-ఎ.చెన్నయ్యధృతరాష్ట్రుడు-పి.మధుసూదన్ రెడ్డి, దేవేంద్రుడు-పి.ఎల్లారెడ్డి కీచకుడు-జి.రాజేశ్వర్ రెడ్డి, జరాసంధుడుసత్యయ్య గౌడ్, భీష్ముడుఎం.చిన్ననర్సిరెడ్డి, అగ్నిదేవుడుపి.వెంకటయ్యబలరాముడుశ్రీశైలం, ద్రుపద మహారాజుయాదగిరి గౌడ్, విదురుడుకె.యాదోజీ, శ్రీకృష్ణుడుకె.నర్సిములు, ఆంజనేయుడుజి.వెంకట్ రెడ్డి, కుంతిదేవిపి.హన్మంతు, ద్రౌపదిరమేష్ గౌడ్. ఈ నాటక ప్రదర్శనలో పంతులు గోపాల్ రెడ్డి, మేకప్ రాజు, హార్మోనియం ఎం.కృష్ణయ్య తమ సేవలను అందిస్తున్నారు. ప్రచారం బాధ్యతలను, తబలిస్ట్ బోడ శేఖర్ నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవంలో భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 9550953041.

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక తెలంగాణ www.localguidenews.com

## సంపాదకీయం


# కార్పొరేట్ సంస్థలకు కళ్లెం

## (విశ్లేషణ)

ప్రభుత్వాల హవా తగ్గి కార్పొరేట్లు, గుప్పెడుమంది వ్యక్తులు రాజ్యాన్ని శాసించే స్థితి ప్రపంచమంతటా వచ్చి చాన్నాళ్లవుతోంది. ఇలాంటి స్థితిలో డిజిటల్ మార్కెటింగ్ చట్టం (డీఎంఏ) ఉల్లంఘనలకు పాల్పడినందుకు అమెరికన్ బడా టెక్ సంస్థలు యాపిల్, మెటా (ఫేస్‌బుక్)లకు భారీయెత్తున జరిమానా విధించి యూరోపియన్ యూనియన్ (ఈయూ) కొంత సాహసాన్ని ప్రదర్శించిందనే చెప్పాలి. యాపిల్ సంస్థకు 57 కోట్ల డాలర్లు (రూ. 4,868 కోట్లుపైగా), మెటా సంస్థకు దాదాపు 23 కోట్ల డాలర్లు (రూ. 1,965 కోట్లు) ఈయూ పెనాల్టీ విధించింది. వచ్చే జూన్ చివరికల్లా యాపిల్ ఈయూ నిబంధనలకు భిన్నంగావున్న తన యాప్ స్టోర్ నిబంధనల్లో సవరణలు చేయకపోతే రోజువారీ జరిమానాలు మొదలవుతాయి. మెటా సంస్థ నిరుడు ఈయూ నోటీసు అందుకున్నాక దారికొచ్చి యాప్ స్టోర్‌లో మార్పులు తెచ్చింది. అందువల్ల పాత తప్పులకు మాత్రమే జరిమానా పడింది. ఈయూ తమపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నదని ఆ రెండు సంస్థలూ ఆరోపిస్తున్నాయి. నిజానికి ఈ రెండు సంస్థలకు విధించిన జరిమానాలూ చాలా తక్కువన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లోవుంది. మ్యూజిక్ స్ట్రీమింగ్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ నిరుడు యాపిల్ సంస్థకు 205 కోట్ల డాలర్ల (రూ. 17,500 కోట్లపైమాటే), మెటా సంస్థకు 90 కోట్ల డాలర్ల (రూ. 7,685 కోట్లకుపైగా) జరిమానాలు విధిస్తున్నట్టు ఈయూ ప్రకటించింది. ఏడాదిగా ఆ సంస్థల వివరణను పరిశీలించే పేరిట తాత్సారం చేసి చివరకు తుది తీర్పు ప్రకటించింది. ఆ సంస్థలు మాత్రం ఇది కూడా అన్యాయమేనన్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నాయి. వర్తమాన పరిస్థితుల్లో ఈయూ ఈ స్థాయి జరిమానాలు విధించటం ఒకరకంగా సాహసమనే చెప్పాలి. ఎందుకంటే అమెరికా అధ్యక్ష పీఠాన్ని ట్రంప్ అధిష్ఠించాక లెక్కలు మారిపోయాయి. సర్వరోగ నివారిణిగా ఆయన అధిక సుంకాల మోతమోగిస్తానంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రత్యేకించి అమెరికన్ టెక్ కంపెనీల జోలికి ఎవరొచ్చినా తాట తీస్తామంటున్నారు. మొన్న ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన కృత్రిమ మేధ సదస్సు సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈయూపై బాహాటంగానే అక్కసు వెళ్లగక్కారు. ఏఐ ప్రగతిని అడ్డుకునేలా యూరప్ వ్యవహ రిస్తున్నదని, అమెరికా బడా సంస్థలను అతిగా నియంత్రించే పోకడలు మానుకోవాలని హెచ్చరించారు. ఆయన ప్రత్యేకించి డీఎంఏ, డిజిటల్ సర్వీసెస్ చట్టం (డీఎస్ఏ)లను ప్రస్తావించారు కూడా. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) సైతం తమకు సమ్మతం కాదని తెలిపారు. యూరప్ దేశాల్లో నిబంధనలు తమ వ్యాపార విస్తరణకూ, లాభార్జనకూ ఆటంకం కలిగిస్తున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నట్టు వాన్స్ వివరించారు. ఈ పోకడల్ని సహించబోమన్నారు. ఇదంతా గుర్తుంచుకుంటే ఈయూ తాజా నిర్ణయంలోని ఆంతర్యమేమిటో బోధపడుతుంది. కాకి పిల్ల కాకికి ముద్దన్నట్టు ఏటా కోట్లాది డాలర్లు పన్నుల రూపంలో చెల్లిస్తున్న తమ బడా సంస్థలంటే అమెరికాకు అభిమానంవుండొచ్చు. కానీ ఆ సంస్థలు రకరకాల నిబంధనల పేరిట సాధారణ వినియోగదారుల్ని పీల్చి పిప్పి చేస్తున్నా, దివాలా తీయిస్తున్నా వేరే దేశాల వారెవరూ మాట్లాడకూడదని ట్రంప్, వాన్స్ భావించటం తెంపరితనం తప్ప మరోటి కాదు. యాపిల్ యాప్ స్టోర్‌లో లభించే మ్యూజిక్ యాప్ తదితరాలపై అధికంగా వసూలు చేస్తున్నారని భావించే వినియోగదారులు నేరుగా తమ వద్ద కొనుగోలు చేయొచ్చని చెప్పే దెవలపర్ల సందేశం కనబడకుండా, ఆ యాప్‌కు నేరుగా తీసుకెళ్లే లింక్‌లు పనిచేయకుండా యాపిల్ నిరోధిస్తున్నది.ఇక మెటా అయితే తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లభ్యమయ్యే యాప్‌లు కావాలంటే వినియోగదారుల వ్యక్తిగత డేటా ఉపయోగించుకోవటానికి అనుమతించాలని షరతు విధిస్తోంది. అంగీకరించనివారికి ఆ యాప్‌లలో వాణిజ్య ప్రకటనలు కనబడేలా చేస్తోంది. అవి వద్దనుకుంటే నెలవారీ ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. సాంకేతికతలు ఎంతగానో విస్తరించిన ఈ తరుణంలో బడా కార్పొరేట్ సంస్థలు వాటిపై ఆధారపడకతప్పని స్థితి జనాలకు కల్పించి చెల్లిస్తారా... చస్తారా అన్నట్టు పీక్కుతింటున్నాయి. ఈ స్థితిలో కీలెరిగి వాతపెట్టిన చందాన డీఎంఏ రంగప్రవేశం చేసింది. టెక్ కంపెనీలు ఉల్లంఘనలకు పాల్పడితే ఆ సంస్థల ప్రపంచ టర్నోవర్‌లో 10 శాతం, పదే పదే ఆ తప్పులు చేస్తూ పోతే ప్రపంచ టర్నోవర్‌లో 20 శాతం మేర జరిమానాలు విధించాలని చట్టం నిర్దేశిస్తోంది. కార్పొరేట్ సంస్థలకు వాతలుపెట్టి అనవసరంగా ట్రంప్ ఆగ్రహాన్ని చవిచూడటమెందుకని ఈయూ జంకుతున్న వైనం తాజా నిర్ణయంలో స్పష్టంగా కనబడుతోంది. వాటిపై చర్య తీసుకుంటున్నామన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లో కలగాలి... అదే సమయంలో ట్రంప్ చేత చీవాట్లు తినకుండా, ఆయనగారిని మరీ నొప్పించకుండా గండాన్ని గట్టెక్కాలి అని ఈయూ భావిస్తోంది. అయితే మనకన్నా ఈయూ ఎంతో నయం. గుత్తాధిపత్య వ్యాపార ధోరణులను అరికట్టడానికున్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠినంగా ఉండలేకపోతున్నది. గూగుల్ సంస్థ పోకడలను అరికట్టడంలో ఎంతో కొంత విజయం సాధించినా అది చాలినంతగా లేదు. వినియోగదారులూ, స్థానిక పరిశ్రమలూ నిలువుదోపిడీకి గురికాకుండా... టెక్ సంస్థలైనా, మరే ఇతర సంస్థలైనా ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా ప్రభుత్వాలు పనిచేయాలి. అందుకు కావలసిన చట్టాలు తీసుకురావాలి. అనారోగ్యకర వ్యాపార పోకడలపై కఠినచర్యలుండాలి. బడా కార్పొరేట్ సంస్థలు తమ లాభాలను అపారంగా పెంచుకోవటం, అవి ప్రభుత్వాల్ని శాసించే స్థితికి ఎదగటం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తుంది. అందుకే ఈయూ చర్యల్ని స్వాగతించాలి.

# కశ్మీర్‌కు పర్యాటక కళ

## శని, ఆదివారాల్లో పెరిగిన రద్దీ సురక్షితమేనంటున్న పర్యాటకులు



కశ్మీర్ నెత్తుటి మరకలను తుడుచుకుంది. పాశవిక దాడి తాలూకు చేదు అనుభవం నుంచి చూస్తుండగానే తేరుకుంది. పర్యాటకులను ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటోంది. దాడి నేపథ్యంలో భయాందోళనలతో లోయను వీడిన టూరిస్టులు ఇప్పుడు అక్కడికి తిరిగి వెళ్తున్నారు. ఉగ్ర దాడుల ఆందోళనలు పూర్తిగా తొలగకపోయినా దేశమంతా ఏకమై ఉందని చెప్పడానికి కశ్మీర్‌ను సందర్శిస్తున్నారు. శని, ఆదివారాల్లో కోల్‌కతా, బెంగళూరు సహా దేశంలోని పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు కశ్మీర్ చేరుకున్నారు. "కశ్మీర్ ఇప్పుడు సురక్షితంగా ఉంది, షాపులు, సందర్శన స్థలాలు అన్నీ తెరిచే ఉన్నాయి" అని వారు స్వయంగా చెబుతున్నారు. "లోయ మళ్లీ పర్యటాకులతో కళకళలాడుతోంది. కశ్మీర్ పర్యటనకు రండి' అని స్థానిక టూర్ ఆపరేటర్లతో పాటు ప్రభుత్వం కూడా పిలుపునిస్తోంది. ప్రఖ్యాత దాల్ సరస్సు ఆదివారం ఉదయం మళ్లీ సందడిగా మారింది. పర్యాటకులు షికారాల్లో విహారాన్ని, స్థానిక ఆతిథ్యాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్నారు. కశ్మీరీల ఆతిథ్యం గొప్పగా ఉందంటూ కొనియాడుతున్నారు. ఉగ్ర దాడితో పర్యాటకం దెబ్బతినకుండా చూసుకుందామంటూ పిలుపునిస్తున్నారు.


### 'ఛలో కశ్మీర్' నటుడు అతుల్ కులకర్ణి

కశ్మీర్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు బాలీవుడ్ నటుడు అతుల్ కులకర్ణి ముందుకొచ్చారు. 'చలో కశ్మీర్' అంటూ ఆయన ఆదివారం ఉదయం పహల్గాం చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో పర్యాటకులు కశ్మీర్‌ను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. "కశ్మీర్ పర్యటన ప్రణాళికలను రద్దు చేసుకుంటే ఉగ్రవాదులు అనుకున్నది నెరవేరుతుంది. అది జరగకూడదు. పర్యాటకులు కశ్మీర్‌కు రావాలి" అని ఎక్స్‌లో పిలుపునిచ్చారు. 'చలో కశ్మీర్', 'టెర్రరిజాన్ని ఓడించండి', 'ఫీట్స్ ఇన్ కశ్మీర్' అంటూ హ్యాష్‌టాగ్‌లు జోడించారు. ఉగ్రవాదాన్ని ఓడించాలనే సందేశంతో కశ్మీర్లో రెండు రోజుల పాటు పర్యటిస్తానని కులకర్ణి చెప్పారు. ఇలాంటి కార్యకలాపాలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే కాకుండా దేశవ్యాప్తంగా ప్రజలు పరస్పరం అర్థం చేసుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కశ్మీరీ జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి ఆసక్తిగా ఉన్న తమిళనాడుకు చెందిన పర్యాటకుల బృందాన్ని పహల్గాంలో చూశానని, ఇలాంటి సంభాషణలు ప్రజల సన్నిహిత బంధాలను పెంపొందించడానికి, ఐక్యత, కరుణ సందేశాన్ని పంపడానికి కూడా సహాయపడతాయని ఆయన అన్నారు. పహల్గాంలోని బైసారన్ లోయలో మంగళవారం ఉగ్ర దాడి జరిగిన వెంటనే కశ్మీర్‌లోని హోటళ్లు, హౌస్ బోట్ల టూరిస్ట్ బుకింగ్స్‌లో 80 శాతం వరకు రద్దవడం తెలిసిందే. వేలాది మంది పర్యాటకులు కశ్మీర్‌లో పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని ప్రత్యేక విమానాలు, రైళ్లలో స్వస్థలాలకు చేరుకున్నారు.

### ఉగ్ర లక్ష్యం నెరవేర నీయొద్దు


"దుర్గా పూజ తర్వాత కశ్మీర్ పర్యటనకు బుకింగ్స్ చేసుకున్నాం. దాడితో షాకయ్యాం. కానీ స్థానికులతో మాట్లాడాక వెళ్లొచ్చని నిర్ధారించుకున్నాం. ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో కశ్మీర్‌ను కచ్చితంగా పర్యటించాలనే వచ్చాం. భయపడి ఆగిపోతే ఉగ్రవాదుల లక్ష్యాన్ని నెరవేర్చిన వాళ్లమవుతాం అనిపించింది. అందుకే వచ్చాం' అని కోల్‌కతా నుంచి వచ్చిన ఓ యువతి తెలిపారు. "ఇప్పుడు కశ్మీర్ సురక్షితంగా ఉంది. గుల్మార్గ్, సోన్‌మార్గ్, తరువాత పహల్గాం కూడా వెళ్లాలనుకుంటున్నాం. కశ్మీర్ భారత్‌లో భాగం. మనం కశ్మీర్ సందర్శించడం స్థానికులకు సాయం చేసినట్టవుతుంది. అవసరముంది" అఈ విషాద సమయాల్లో మనమంతా ఒక్కటని చాటాల్సినని మరో యువకుడు నొక్కి చెప్పారు. "మేం దాడి తర్వాతే వచ్చాం. ఇప్పుడిక్కడ అంతా సాధారణంగానే ఉంది. చల్లటి వాతావరణాన్ని ఎంజాయ్ చేశాం' అని బెంగళూరుకు చెందిన దంపతులు చెప్పారు.

# మలబారు యాత్ర



వైకోం మహమ్మద్ బషీర్ తమ ఇంటిముందున్న వంగమామిడి చెట్టుకింద కూర్చుని రాసేవారట. ఆ చెట్టు గాలిని పీల్చే 'మా తాతకో ఏనుగుండేది', 'చిన్ననాటి నేస్తం', 'గోడలు' లాంటి ఆయన రచనలు ఊపిరి పోసుకున్నాయి. బషీర్ అభిమానులకు ఆ చెట్టును చూడటం గొప్ప సంతోషం. అంతేనా? ఆయన విన్న గ్రామ్‌ఫోన్ రికార్డు, ఆయన సేదతీరిన ఆరాం కుర్చీ కూడా ప్రత్యేకమే. బషీర్‌ను ఆయన జన్మించిన బేపూర్‌ను బట్టి బేపూర్ సుల్తాన్ అంటారు. ఆయన వస్తువులు, ఆయన జీవితాన్ని తెలియజెప్పే విశేషాలతో ఆ ఊళ్లో కేరళ ప్రభుత్వం ఒక మెమోరియల్ నిర్మిస్తోంది. బషీర్ క్లాసిక్ అయిన 'ప్రేమలేఖనం' నవలలో దంపతులు తమ చిన్నారికి పెట్టుకున్న ఆకాశమిఠాయి పేరునే ఈ స్మారక కేంద్రానికి ఉంచారు. ఒక రచయితకు మెమోరియల్ నిర్మించడం దానికదే విశేషమే అయినా, నిత్య సాహిత్య రాష్ట్రమైన కేరళ తన సాహిత్య స్పృహను మరో స్థాయికి తీసుకెళ్లింది. రచయితల మెమోరియల్స్‌ను కలుపుతూ దేశంలోనే తొట్టతొలి సాహిత్య యాత్రకు శ్రీకారం చుడుతోంది. 'మలబార్ లిటెరరీ టూరిజం సర్క్యూట్' పేరుతో ఈ యాత్ర కోళికోడ్, మలప్పురం, పాలక్కాడ్ జిల్లాలను కవర్ చేస్తుంది. మలయాళ సాహిత్యంలో ప్రాచీన కవిత్రయంలో ఒకరిగా పిలిచే, ఆధునిక మలయాళ సాహిత్య పితామహుడిగానూ కొలిచే 16వ శతాబ్దపు కవి, భాషావేత్త తుంచాత్తు రామానుజన్ ఎలుత్తాచ్చన్ గ్రామమైన తుంజన్ పరంబు మలబారు ప్రాంతంలోనే ఉంది. విజయదశమి రోజున చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల అక్షరాభ్యాసం కోసం ఈ గ్రామాన్ని దర్శించుకుంటారు. ఈ మలబారు ప్రాంతంలోనే జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఎం.టి.వాసుదేవన్ నాయర్‌బీ రచయిత, కార్టూనిస్ట్ ఒ.వి.విజయన్‌బీ ప్రఖ్యాత యాత్రాసాహిత్య కర్త ఎస్.కె.పొట్టెక్కాట్‌బీ మరో కవి, జ్ఞానపీఠ గ్రహీత అఖితం అచ్యుతన్ నంబూద్రి లాంటివారి స్మారక కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఇవి భిన్న దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వాటన్నింటినీ అభిమానులు కలయదిరిగేలా, రచయితల పుస్తకంలో ప్రాణం పోసుకున్న ప్రాంతాలను ప్రత్యక్షంగా అనుభవించేలా, మానవ ఉద్వేగాలన్నీ కాగితాల్లోకి ఎలా బదిలీ అయ్యాయో తెలుసుకునేలా కేరళ పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 2021లోనే ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయింపులు జరపగా, ఈ సంవత్సరం మధ్యకల్లా దీన్ని ప్రారంభించే అవకాశం ఉంది. కోళికోడ్‌ను యునెస్కో భారతదేశ తొట్టతొలి సాహిత్య నగరంగా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ వల్ల ఆ నగర ఘనత మరింతగా ఇనుమడిస్తుంది. లండన్‌లోని షేక్స్పియర్ స్మారక కేంద్రాన్ని ఏటా పాతిక లక్షల మంది సందర్శిస్తారు. యూకేలో భిన్న లిటెరరీ సర్క్యూట్స్, వాటికి తగిన ఏర్పాట్లు ఉన్నాయి. దక్షిణ అమెరికాలోని కొలంబియాలో మ్యూజియంగా మార్చిన గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్ ఇల్లు, ఆయన చదివిన పాఠశాల, ఆయన వెళ్లిన గ్రంథాలయం... ఇలా ఆయన 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్'కు ప్రేరణగా నిలిచిన అన్ని ప్రదేశాలను కలుపుతూ ప్రయాణించవచ్చు. ప్రముఖ మలయాళ సాహిత్యకారులకు కూడా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు ఉంది. వీళ్ల రచనలు భిన్న భారతీయ భాషలతో పాటు, ఆంగ్లం, ఇతర ప్రపంచ భాషల్లోకి అనువాదమయ్యాయి. దానికి తగ్గ ఉత్సాహం, ప్రోత్సాహం అక్కడ ఉన్నాయి. అందుకే సందర్శకులు భిన్న ప్రాంతాల నుంచి వచ్చే అవకాశం ఉంది. మరి తెలుగు రచయితల పరిస్థితి ఏమిటి? ముందు తెలుగు రచయితలను తెలుగువాళ్లకు పరిచయం చేయడమే పెద్ద సవాలు కావొచ్చు. వైజాగ్ వైపు వెళ్లే కొందరు సాహిత్యాభిమానులు ప్రత్యేకించి భీమిలి వెళ్లొస్తారు చలం ఇంటి కోసం. విజయనగరం వైపు పోయేవాళ్లు గురజాడ గృహాన్ని దర్శించవచ్చు. అదే విశాఖపట్నానితో ముడిపడిన శ్రీశ్రీ, రావిశాస్త్రిలను ముడేస్తూ, అటుగా శ్రీకాకుళంలోని కథానిలయంతో కరచాలనం చేసేలా ఉత్తరాంధ్ర సాహితీయానం చేయగలిగితే ఎలా ఉంటుంది? పోతన, దాశరథి, కాళోజీ లాంటి వాళ్లను తలుచుకోగలిగే వరంగల్ సాహిత్య టూర్ ఎందుకు ఉండకూడదు? రచయితలను ప్రాంతాల వారీగానో, జిల్లాల వారీగానో అనుసంధానం చేసే సాహిత్య టూర్లను ఆశించడం తెలుగు నేల మీద మరీ అత్యాశా? కానీ ఎంతమంది రచయితలకు మెమోరియల్స్ ఉన్నాయి? కనీసం విగ్రహాలైనా ఉన్నాయా? కువెంపు విమానాశ్రయం (శివమొగ్గ) అని కన్నడవాళ్లు పెట్టుకున్నట్టుగా తెలుగు నేల మీద అలా ఒక రచయితకు గౌరవం దక్కుతుందా? ప్రాచీన ప్రపంచంలో ఈజిప్టులోని అలెగ్జాండ్రియా లైబ్రరీ ఒక జ్ఞానధామం. క్రీ.పూ. మూడో శతాబ్దానికి చెందిన ఇది ఆ కాలపు గొప్ప పండితులందరికీ నిత్య సందర్శనా స్థలం. అమెజాన్ కంపెనీ తన వర్చువల్ అసిస్టెంట్‌ను ప్రారంభించినప్పుడు దాని పేరును అలెగ్జాండ్రియాకు నివాళిగా ఎన్నుకుంది. అట్లా 'అలెక్సా' చాలామంది జీవితాలకు చేరువైంది. సాహిత్యంతో పరిచయం లేదనుకునేవాళ్లు కూడా దాని ఫలాలను ఇంకో రూపంలో అనుభవిస్తూనే ఉంటారు. 'పోషణ, ఆవాసం, సాహచర్యం తర్వాత ఈ ప్రపంచంలో మనకు అత్యంతగా కావాల్సింది కథలు' అంటాడు ఫిలిప్ పుల్‌మాన్. 'రచయితలో కన్నీళ్లు లేకపోతే పాఠకుడిలో కన్నీళ్లు లేవు. రచయితలో ఆశ్చర్యం లేకపోతే పాఠకుడిలో ఆశ్చర్యం లేదు' అంటాడు రాబర్ట్ ఫ్రాస్ట్. రచయితలో ఉన్నదే పాఠకుడికి అందుతుంది. రచయితలో ఉన్నదంతా కూడా పాఠకుడికి బదిలీ అవుతుంది. సాహిత్యం అనేది మన అంతరాత్మలను వెలిగించే అదృశ్య దివ్వె. అందుకే సాహిత్య సృష్టికర్తలను తలుచుకునే ఏ ప్రయత్నం అయినా ప్రాధాన్యత కలిగినదే, దానికోసం తీసుకునే ఏ చొరవైనా విలువైనదే!

# పంచాయతీల బలోపేతానికి చర్యలేవి?




చారిత్రకంగా భారతదేశంలో మొట్టమొదట చోళుల పరిపాలన వ్యవస్థ 'స్వయం పరిపాలన'కు నాంది పలికింది. స్వాతంత్ర్య అనంతరం మన దేశంలో పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా స్థానిక స్వపరిపాలన కోసం మూడంచెల 'పంచాయతీరాజ్ వ్యవస్థ'ను ఏర్పాటు చేయడం జరిగినది. ఇది కిందిస్థాయి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమైన మైలురాయిగా చారిత్రక ప్రాముఖ్యతను సంతరించుకుంది. అదే విధంగా స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష వేదికగా నిలిచింది. భారత దేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే.. గ్రామీణ ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని ఆకాంక్షిస్తూ భారత ప్రభుత్వం మొట్టమొదటిసారిగా 1952లో సామాజిక అభివృద్ధి కార్యక్రమాన్ని(సిడిపి) ప్రారంభించింది. తదుపరి జాతీయ విస్తరణ సేవ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ప్రజల క్రియాశీలక భాగస్వామ్యం లేకపోవడంతో సామాజిక అభివృద్ధి కార్యక్రమం, జాతీయ విస్తరణ సేవాపథకం క్షేత్రస్థాయిలో అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయాయి. వీటి అమలు విధానాన్ని అధ్యయనం చేసి వాటిని మరింత పటిష్టం చేయడానికి అవసరమైన సూచనల కోసం భారత ప్రభుత్వం 1957లో బల్వంతరాయ్ మెహతా కమిటీని నియమించింది. ఈ కమిటీ సూచించిన ప్రజాస్వామిక వికేంద్రీకరణ విధానమే నేటి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థకు దారితీసింది. తదుపరి అనేక కమిటీల సిఫార్సుల మేరకు బలమైన మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. దేశంలో పంచాయతీరాజ్ సంస్థలను ఏర్పాటు చేసిన మొదటి రాష్ట్రం రాజస్థాన్ కాగా, రెండవది ఆంధ్రప్రదేశ్. ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో స్థానిక సంస్థల పరిపుష్టం చేయడానికి 73 రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు. దీనిని 1993, ఏప్రిల్ 24 నుంచి అమలు చేయడం జరిగింది. భారత ప్రభుత్వం అధికారికంగా 2010 నుండి ప్రతి ఏటా ఈ రోజు 'జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం' గా నిర్వహించడం జరుగుతుంది. ఈ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగం 9వ భాగంలో పంచాయతీల పేరుతో ఒక కొత్త అధ్యయనం చేర్చి అధికరణ 243ఎ నుండి 243ఒ వరకు నిబంధనలు పొందుపరిచారు. అదే విధంగా రాజ్యాంగంలో 11 షెడ్యూల్ అదనంగా చేర్చి, పంచాయతీరాజ్ సంస్థలు నిర్వర్తించాల్సిన 29 విధులను కూడా పొందుపరచారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో40వ అధికరణం ఆచరణీయ కార్యక్రమానికి నిదర్శనంగా పంచాయితీ రాజ్ వ్యవస్థను పేర్కొనవచ్చు. 73వ రాజ్యాంగ సవరణ పంచాయతీ వ్యవస్థకు రాజ్యాంగపరమైన హోదా కల్పించడం జరిగింది. దీనిని మొదట అమలుపరిచిన రాష్ట్రం మధ్యప్రదేశ్. గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో మండల పంచాయతీ, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ వ్యవస్థ ఏర్పాటు చేయబడినది. వీటి సభ్యులందరూ ప్రజలచేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడతారు. పంచాయతీరాజ్ వ్యవస్థ మౌలిక విభాగం గ్రామం. గ్రామస్థాయిలో గ్రామసభలు రాష్ట్ర శాసనసభ నిర్దేశించిన విధంగా నిర్వహించబడతాయి. గ్రామసభలు గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించి ఆమోదిస్తాయి. గ్రామపంచాయతీ పౌరసరఫరాల కల్పన, మంచినీటి సరఫరా, పరిశుభ్రత, వీధిదీపాల నిర్వహణ, రోడ్లు, జననమరణాలు నమోదు, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం లాంటి అనేక అంశాలను నిర్వహించడం జరుగుతుంది. పంచాయతీ వ్యవస్థ ప్రజల వద్దకు పాలన తీసుకువెళ్లి ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కీలక భూమిక పోషించినా, క్షేత్ర స్థాయిలో అనేక వైఫల్యాలను చవిచూడడం జరుగుతున్నది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామసభలే నిర్వహించాలి. కానీ ఆచరణలో జరగడం లేదు. ఆర్థిక వనరుల కొరత స్థానిక సంస్థల స్ఫూర్తిని నీరుగారుస్తున్నాయి. మహిళలకు బలహీనవర్గాల వారికి చట్టపరంగా సముచిత ప్రాధాన్యత కల్పించినప్పటికీ ఆచరణలో ఆశించినమేరకు తమ ఉనికిని చాటుకోలేకపోతున్నారు. దీనికిగల కారణం తరతరాలుగా కొనసాగుతున్న సాంప్రదాయాలు, కుల వ్యవస్థ, పురుషాధిపత్యం అని పేర్కొనవచ్చు. పేదరికం, నిరక్షరాస్యత, రాజకీయ చైతన్యం లేకపోవడం వల్ల స్థానిక సంస్థల పనితీరుకు అడ్డంకిగా మారుతున్నాయి. పంచాయతీరాజ్ చట్టాన్ని అమలులో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వడం వలన కూడా రాష్ట్రప్రభుత్వాలు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం, ఆర్థిక సంఘం సిఫార్సులను కూడా బేఖాతరు జరుగుతుంది. పంచాయతీరాజ్ వ్యవస్థలోనీ లోపాలను సవరించి మరిన్ని అధికారాలు ఇస్తూ తెలంగాణ రాష్ట్రంలోని నూతన పంచాయతీ రాజ్ చట్టం 2018 రూపొందించడం జరిగింది. ఆచరణలో మాత్రం పటిష్టంగా ముందుకుపోవడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో కూడా గత సంవత్సర కాలంనుంచి పంచాయతీ ఎలక్షన్లు జరగడం లేదు. దీంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కూడా రాక పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతున్నది. 11వ షెడ్యూల్లో పొందుపరిచిన అంశాలను పూర్తిగా స్థానిక సంస్థలకు బదిలీ జరగకపోవడం వలన వాటి పనితీరు దెబ్బ తింటున్నది. గ్రామస్థాయిలో ప్రభుత్వం నెలకొల్పిన అనేక సంఘాలు, కమిటీలు సమాంతర వ్యవస్థలుగా మారి పంచాయతీలను బలహీనపరిస్తున్నాయి. ఈ మధ్య పంచాయతీ పాలకవర్గంలో రోజురోజుకు పెరిగిపోతున్న రాజకీయ జోక్యం వలన పాలకవర్గం ప్రభుత్వ ప్రతినిధులకు అనుచరులుగా మారి పంచాయతీల స్వతంత్రను దెబ్బ తీస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల పనితీరును బలోపేతం చేయడానికి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిత్వ శాఖ పలు సూచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా దేశంలో ప్రతి జిల్లాలో జిల్లా ప్రణాళిక కమిటీ ఏర్పాటు చేసి, పంచాయితీలకు అన్ని అధికారుల బదిలీ చేసి రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక సహాయ నిధులను కేంద్రం మంజూరు చేయాలన్నది. పంచాయతీలకు పలు అంశాలపై పన్నులు విధించే అధికారం కల్పించాలని, ఇ - పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొనడం జరిగింది. అదే విధంగా రెండో పరిపాలనా సంస్కరణల సంఘం కూడా అనేక సూచనలు చేసింది. ఇది స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ స్వయం ప్రతిపత్తి కల్పించడమే కాకుండా, స్థానిక సంస్థలకు జవాబుదారీగా ఉన్నాయి. వీటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు పరచి పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. అప్పుడే గ్రామస్వరాజ్యం సాధ్యమవుతుంది.

# కాయగూరల విత్తనోత్పత్తిలో మెళకువలు

నాణ్యమైన విత్తనం నాటితే..

పాడి-పంట : డా.పిడిగెం సైదయ్య, అసోసియేట్ డీన్, మోజర్ల ఉద్యాన కళాశాల



కొత్తకోట రూరల్: పంటల సాగులో నాణ్యమైన విత్తనానిదే ప్రధాన పాత్ర. నాణ్యమైన విత్తనం నాటితే సగం దిగుబడి సాధించినట్లే. సాగులో వినియోగించే ఎరువులు, నీరు, ఇతర ఉత్పత్తి కారకాల సామర్థ్యం విత్తనం నాణ్యతపైనే ఆధారపడి ఉంటుంది. సిఫార్సు చేసిన విత్తన మొలక శాతం, తేమ, భౌతిక, జన్యు స్వచ్ఛత కలిగిన విత్తనాలు వాడాలి. అప్పుడే నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చు. మార్కెట్లో కాయగూరల విత్తనాలు లభ్యమవుతున్నా.. వాటి నాణ్యతపై అంతగా భరోసా లేదు. కాబట్టి రైతులు తమస్థాయిలో తక్కువ ఖర్చుతో తగిన మోతాదులో విత్తనాన్ని ఉత్పత్తి చేసుకోవచ్చు. కాని అన్ని కాయగూరల పంటల్లో విత్తనోత్పత్తి సాధ్యం కాదు. టమాటా, వంకాయ, మిరపతో పాటు తీగజాతి పంటలు, గోరుచిక్కుడు, తోటకూర మొదలైన ఉష్ణ ప్రాంతపు పంటల్లో మాత్రమే విత్తనోత్పత్తి సాధ్యం. చలికాలం పంటలైన క్యాబేజీ, కాలీఫ్లవర్ తదితర పంటల విత్తనోత్పత్తి మన ప్రాంతంలో సాధ్యం కాదు. విత్తనోత్పత్తి చేపట్టే ప్రాంతంలో పరిస్థితులు విత్తన నాణ్యతపై ప్రభావం చూపుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న ప్రాంతాలు, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు విత్తనోత్పత్తికి పనికిరావు. విత్తనోత్పత్తి ప్రాంతంలో పగలు సూర్యరశ్మి కనీసం 10 నుంచి 12 గంటలు ఉండాలి. ముఖ్యంగా కాయలు కోత కొచ్చే సమయంలో వర్షాలు రాకుండా ముందుగానే విత్తనాలు పొలంలో వేసుకోవాలి.

## జాగ్రత్తలు తప్పనిసరి..

విత్తనోత్పత్తి చేసే ముందు కొన్ని అంశాల్లో జాగ్రత్తలు పాటించాలి. మొదట నిర్ణయించుకున్న అధీకృత డీలరు లేదా పరిశోధనా స్థానం నుంచి ఫౌండేషన్ విత్తనం సేకరించుకోవాలి. రెండోది విత్తన దూరం పాటించాలి. ఒక్క టమాటాలో తప్పితే చాలాపంటల్లో తరచూ పరపరాగ సంపర్కం లేదా పూర్తిగా పరపరాగ సంపర్కం జరుగుతుండటంతో విత్తనంలో కల్తీలు ఏర్పడి నాణ్యత తగ్గుతుంది. కావున వేర్పాటు దూరం కచ్చితంగా పాటించాలి. వేర్పాటు మూడు రకాలుగా ఉంటుంది. విత్తనోత్పత్తి చేపట్టే ఒక పంట వేసిన తర్వాత కనీసం 20 నుంచి 25 రోజుల తర్వాత వేరే విత్తన పంట వేసుకోవాలి. అప్పుడు కల్తీ ఉండదు. అది సాధ్యం కాకపోతే సిఫార్సు మోతాదులో వేర్పాటు దూరం పాటించాలి. మూల విత్తనం, బ్రీడర్ విత్తనం, ఫౌండేషన్ ధ్రువీకరణ విత్తనం ఉత్పత్తిలో ధ్రువీకరణ విత్తన ఉత్పత్తిని మాత్రమే రైతులు చేపట్టవచ్చు.

## తీగజాతి కూరగాయలు..

కాకర, గుమ్మడి, బూడిద గుమ్మడి, దోస రకాల్లో వాటి పండ్లరంగు, కాడ రంగు, తీగలు ఎండిపోవడాన్ని బట్టి పక్వానికి వచ్చాయని నిర్ధారించుకోవచ్చు. పండిన పండ్లను కోసి చేతితో విత్తనాన్ని వేరు చేసి సేకరించుకోవాలి. తర్వాత నీటితో కడిగి ఆరబెట్టుకోవాలి. ఎకరా పంట నుంచి 120 నుంచి 320 కిలోల విత్తనం పొందవచ్చు. అన్ని కాయగూరల విత్తనోత్పత్తికి కోత అనంతరం పండ్లను 5 నుంచి 7 రోజులు నిల్వ ఉంచినట్లయితే విత్తనం బాగా అభివృద్ధి చెంది నాణ్యంగా ఉంటుంది.

# పత్తి పండు!



అవును. దీని పేరు పత్తి పండే! వేసవి తాపాన్ని తీర్చే అద్భుతమైన తినదగిన పత్తి పండు ఇది. మధ్యకు కోస్తే దీంట్లో తెల్లని రూది మాదిరిగా కనిపించే గుజ్జు ఉంటుంది. విలక్షణమైన ఈ పండుకు 'సెంతొల్', 'కాటన్ ఫ్రూట్'తో పాటు చాలా మారు పేర్లున్నాయి. కెచపి, లాల్లీ ఫ్రూట్, వైల్డ్ మాంగోస్టీన్, రెడ్ సెంతొల్, సెంతుల్, యె, వైసయన్.. ఇలా అనేక పేర్లుతో పిలుస్తారు. ఆగ్నేయాసియా ప్రాంతమే పత్తి పండు పుట్టిల్లు. దీని శాస్త్రీయ నామం 'సండోరికం కోయెట్జాపే'. మెనియాసీ లేదా మహోగని కుటుంబానికి చెందినది. ఈ పండు గుజ్జు తీపి, వగరు కలిసిన చిత్రమైన రుచి కలిగి ఉంటుంది. ఆగ్నేసియా దేశాల్లోని ఉష్ణమండల లోతట్టు భూముల్లో విస్తృతంగా సాగవుతున్న పండ్ల చెట్టు ఇది. తాజా పండ్ల వాడకమే ఎక్కువ. సంతొల్ చెట్లు లోయర్ ఆల్టిట్యూడ్ ప్రాంతాల్లో చాలా ఎత్తుగా, వేగంగా పెరుగుతాయి. సాధారణంగా 15-40 మీటర్ల ఎత్తు పెరుగుతాయి. ఆకులు ముదురు ఆకుపచ్చగా 4-10 అంగుళాల పొడవు పెరుగుతాయి. పూలు 1 సెం.మీ. పొడవున ఆకుపచ్చ, పసుపు, గులాబీ రంగుల్లో ఉంటాయి. పత్తి పండు గుండ్రంగా, ఆపిల్ సైజులో ఉంటుంది. పండు లోపల రసంతో కూడిన ఐదు దూది తొనల మాదిరిగా ఉంటాయి. 3-4 విత్తనాలుంటాయి. దీని గుజ్జు వగరగా ఉంటుంది. పండు పండిన తర్వాత తియ్యగా మారుతుంది. కొన్ని రకాల సంతొల్ పండ్లు తక్కువ తీపిగా, మరికొన్ని రకాలు మరింత తీపిగా ఉంటాయి. బాగా తియ్యగా ఉండే పండ్లు ఆపిల్ రుచికి దగ్గరగా ఉంటాయి.

## రెండు రకాలు

సంతొల్ పండుకు సంబంధించి ప్రధానంగా రెండు వంగడాలు ఎరుపు (ఎస్.కోయెట్జాపే), పసుపు (ఎస్. నెర్వోసమ్) రంగుల్లో ఉంటాయి. ఎరుపు రంగులో ఉండే రకం పత్తి పండ్లను రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. మార్కెట్లలో ఇవే ఎక్కువగా కనిపిస్తాయి. కొమ్మకు కాయకు మధ్య ఉండే కాడలు, తొక్క, పండు రుచిలో ఈ రెండు రకాల పండ్లకు స్పష్టమైన వ్యత్యాసం ఉంటుంది. పసుపు సంతొల్ పండు తొడిమెలు 15 సెం.మీ. పొడవున ఉంటాయి. పండు కోతకు వచ్చే సమయానికి తొడిమలు కూడా పసుపు రంగులోకి మారతాయి. ఎరుపు సంతొల్ పండ్ల తొడిమెలు 30 సెం.మీ. వరకు పెరిగి, ఎరుపుగా మారతాయి. పసుపు పండు తొక్క పల్చగా, రుచి తియ్యగా ఉంటుంది. ఎర్ర పండు తొక్క మందంగా, రుచి కొంచెం వగరుగా ఉంటుంది.

## ఆరోగ్య ప్రయోజనాలు

1. కేన్సర్ నివారణ: సంతొల్ పండులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కేన్సర్ కణాల వ్యాప్తిని ఇవి అరికడతాయి. ఈ పండు నుంచి సంగ్రహించే సెకోట్రిటెర్పెన్, కోయెట్జాపిక్ ఆసిడ్ అనే రెండు బయోయాక్టివ్ కెమికల్స్ కేన్సర్ కణాలపై సైటోటాక్సిక్ ప్రభావం చూపుతాయని పరిశోధనల్లో వెల్లడైంది. ఎలుకల స్తన గ్రంధుల్లో గడ్డల సైజును, సంఖ్యను తగ్గించగలిగాయి. మనుషుల్లో కేన్సర్ కణాలను ఇవి హరిస్తాయని పరిశోధనల్లో వెల్లడైంది.

2. ఆరోగ్యకరమైన దంతాలు: పత్తి పండ్లు లాలాజలానికి సంబంధించిన గ్రంధులను ఉత్తేజపరచటం ద్వారా మరింత లాలాజలాన్ని ఉత్పత్తి చేస్తాయి. నోట్లో హానికారక క్రిములను నశింపజేయటం ద్వారా దంతాల ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

3. ఎల్‌డిఎల్‌ను తగ్గిస్తాయి: సంతొల్ పండులో పెక్టిన్ అనే జీర్ణమయ్యే పీచు ఉంటుంది. లో డెన్సిటీ లిపోప్రొటీన్ (ఎల్‌డిఎల్) రక్తంలో ఎక్కువగా ఉంటే రక్తపోటు, గుండెపోటు తదితర గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. పెక్టిన్, హెచ్‌డిఎల్‌లు కలసి ఎల్‌డిఎల్‌ను రక్త ప్రసరణ వ్యవస్థలోకి చేరకుండా చూస్తాయి. తద్వారా సంతొల్ పండు గుండె జబ్బుల్ని నివారిస్తుంది.

4. బరువు తగ్గిస్తుంది: శరీరపు అధిక బరువు గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, హార్మోన్ అసమతుల్యత వంటి అనేక సమస్యలకు కారణం. ఈ పండ్లలో జీర్ణమయ్యే, కాని పీచు పదార్థాలు ఉంటాయి. తిండి యావ తగ్గించటం ద్వారా ఊబకాయం తగ్గటానికి, ఆరోగ్యం మెరుగుపడడానికి దోహదం చేస్తుంది.

5. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది: పత్తి పండులోని క్వెర్సెటిన్ అనే యాంటాఆక్సిడెంట్ రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. కణాలను బాగు చేయటం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. ఇందులోని పీచు పదార్థం ప్రోబయాటిక్ మైక్రోఆర్గానిజమ్స్‌ని ఉత్తేజపరచి రోగనిరోధక శక్తిని ఇనుమడింపజేస్తుంది. విటమిన్ సి కూడా పుష్కలంగా ఉంటుంది.

6. రక్తహీనత, అల్జిమర్స్‌ను తగ్గిస్తుంది: దేహంలో సరిపోయినంతగా ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాలు లేకపోతే రక్తహీనత కలుగుతుంది. రక్తంలో ఆక్సిజన్ చలనానికి ఐరన్ అవసరం. ఈ పండ్లలోని విటమిన్ సి వల్ల ఐరన్‌ను ఇముడ్చుకోగల శక్తిని జీర్ణవ్యవస్థ పెంచుకుంటుంది. ఇందులో పుష్కలంగా ఉన్న యాంటీఆక్సిడెంట్లు మెదడును ఆరోగ్యంగా ఉంచుతూ ల్జిమర్స్ ముప్పు నుంచి తప్పిస్తాయి.

7. రక్తంలో చక్కెర నియంత్రణ: ఈ పండు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ. కాబట్టి గ్లూకోజ్‌ను నెమ్మదిగా రక్తంలో కలిసేందుకు దోహదం చేస్తుంది. తద్వారా బ్లడ్ సుగర్ స్థాయి నియంత్రణలో ఉంటుంది.

8. చర్మ సౌందర్యం: చర్మంలోని కణాల మధ్య కండరాలను ఆరోగ్యంగా ఉంచడానికి కొల్లాజెన్ ఉపయోగపడుతుంది. ఇది ఏర్పరడడానికి ఈ పండ్లలోని విటమిన్ సి దోహదపడుతుంది. ఈ పండ్లలోని శాండ్రోనిక్ ఆసిడ్, బ్రయోనోటికాసిడ్‌లు అలెర్జీలను నివారిస్తాయి. చర్మంపై పొక్కులు, సోరియాసిస్, ఇతర చర్మ సంబంధమైన సమస్యలకు చేసే చికిత్సలో ఈ పండ్లలోని సహజ స్టెరాయిడల్ సపోజెనిన్, అల్కలాయిడ్స్ ఉపయోగపడతాయి. ఈ చెట్టు బెరడులో సపోజెనిన్ ఉంటుంది. తామర, తదితర ఫంగల్ ఇన్ఫెక్షన్లను తగ్గించే చికిత్సకు ఇది ఉపకరిస్తుంది. ఈ చెట్టు బెరడు పొడిని చర్మంపై లేపనం చేస్తే ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి.


9. స్త్రీ వ్యాధుల్ని తగ్గిస్తుంది: స్త్రీ జననాంగంలో ఇన్ఫెక్షన్ల చికిత్సకు ఈ పండుతో పాటు చెట్టు బెరడు కూడా ఉపయోగపడుతుంది. ఈ బెరడు వేసి ఉడికించిన కషాయంతో యోనిని రోజూ శుభ్రం చేసుకుంటే ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి.

## విలువ ఆధారిత ఉత్పత్తులు...

థాయ్ వంటకాల్లో, సలాడ్లలో సంతొల్ పండ్ల ముక్కలను వాడుతుంటారు. ఈ పండ్లతో తయారు చేసే సోం టామ్ అనే ఉత్పత్తిని రొయ్యల కూరల్లో వాడతారు. ఈ పండ్ల తరుగుతో తయారు చేసే సినటొలన్ అప్పెటైజర్‌గా వాడతారు. అనేక వంటకాల్లో వగరు రుచి కోసం కూడా పత్తి పండు తరుగును వాడుతూ ఉంటారు.

# ఇంటి పంటల సాగుకు ఏడు సూత్రాలు!

పప్రారంభించిన 'ఇంటిపంట' కాలమ్ తెలుగు రాష్ట్రాల్లో వేలాది మందిలో స్ఫూర్తిని రగిలించి 'ఇంటిపంట'ల సాగుకు ఉపక్రమింపజేసింది. నివసించే ఇంటి వద్ద ఉన్న తక్కువ స్థలంలోనే కూరగాయలు, ఆకుకూరలు సేంద్రియ పద్ధతిలో పండించుకుంటూ ఆరోగ్యవంతమైన జీవనం గడుపుతున్నారు. అటువంటి సహజాహార ప్రేమికుల్లో డా. వసంత శ్రీనివాసరావు ఒకరు. కొత్తగా ఇంటిపంటల సాగు ప్రారంభించిన వారికి తరచూ ఎదురయ్యే సందేహాల నివృత్తి కోసం.. కొన్ని పద్ధతులు, సూచనలను స్వీయానుభవంతో ఆయన మీ ముందుంచుతున్నారు.



### జీవామృతం..

### కావలసిన పదార్థాలు...

తాజా(పది రోజుల్లోపు) నాటు లేదా దేశీ ఆవు పేడ 2 కేజీలు, నాటు ఆవు పంచకం ఒకటిన్నర లీటర్లు, బెల్లం (సేంద్రియ బెల్లం ఉత్తమం) అర కేజీ, ఏదైనా పప్పుల(కంది/శనగ/మినుము/పెసర..) పిండి అర కేజీ, బాగా పండిన అరటి పండ్లు 2 లేదా 3, చెట్ల కింద మట్టి 2 గుప్పిళ్లు, 30 - 35 లీటర్ల నీరు, 50 లీటర్ల డ్రమ్ము.

### తయారీ విధానం...



పేడ, తురుముకున్న బెల్లం, పప్పుల పిండి, మట్టి, అరటి పండ్ల గుజ్జు.. వీటిని చేతితో బాగా కలపాలి. ఆ తరువాత ఈ మిశ్రమంలో ఆవు పంచకం వేసి మళ్లీ కలపాలి. ఇలా తయారు చేసుకున్న మిశ్రమాన్ని 50 లీటర్లు పట్టే డ్రమ్ములో వేసుకొని 30 నుంచి 35 లీటర్ల నీటిని పోయాలి. ఇలా తయారు చేసుకున్న ద్రావణాన్ని నీడలో పెట్టుకోవాలి. ఇలా భద్రపరచుకున్న ద్రావణాన్ని ఉదయం, సాయంత్రం పూటల్లో వేప కర్రతో ఒక నిమిషం పాటు కుడి చేతివైపు తిప్పుతూ మొదట 3 రోజులు కలుపుకోవాలి. నాలుగో రోజు నుంచి వాడుకోవడానికి జీవామృతం మంచి బ్యాక్టీరియాతో తయారవుతుంది.

వాడే విధానం: ఇలా తయారైన జీవామృతాన్ని 1:10 నిష్పత్తిలో మొక్కలు, చెట్ల పాదుల్లో పోయవచ్చు. వాటిపైన పిచికారీ చేయొచ్చు. ఇలా తయారుచేసుకున్న జీవామృతాన్ని 7-10 రోజుల్లోపు వినియోగించాలి.

### బూడిదం పసుపు మిశ్రమం

### కావలసిన పదార్థాలు...

దేశీ/నాటు ఆవు పేడతో చేసిన పిడకలు, పసుపు తయారీ పద్ధతి... పిడకలను కాల్చి బూడిద చేసుకోవాలి. తర్వాత ఆ బూడిదను మట్టికుండలో నిల్వ చేసుకోవాలి. ఇలా నిల్వ చేసుకున్న బూడిద తగినంత తీసుకొని.. అంతే పరిమాణంలో పసుపు కల?ిలి. ఈ మిశ్రమాన్ని తీగజాతి మొక్కలపై చల్లితే పూత రాలడం తగ్గుతుంది.

### కీటకాల నివారిణి(మల్టీ పెస్ట్ కంట్రోలర్)...

### కావలసిన పదార్థాలు...

పావు కేజీ చొప్పున జిల్లేడు, మారేడు, వేప, కానుగ, ఉమ్మెత్త, సీతాఫలం, గన్నేరు ఆకులతోపాటు దేశీ ఆవు పంచకం(డ్రమ్ములో వేసిన ఈ ఆకుల మిశ్రమం పూర్తిగా మునగడానికి) తగినంత. తయారీ విధానం: పైన చెప్పిన అన్ని రకాల ఆకులను మెత్తగా నూరుకొని.. ఏదైనా ఒక ప్లాస్టిక్ పాత్రలో పెట్టి ఆకుల మిశ్రమం పూర్తిగా మునిగే వరకు ఆవు మూత్రం పోయాలి. ఈ మిశ్రమాన్ని 15 రోజులు మురగబెట్టాలి. ఆ తర్వాత వడకట్టుకొని ఒక సీసాలో నిల్వ చేసుకోవాలి. కషాయాన్ని 1:30 నిష్పత్తిలో నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేసుకోవాలి. ఇది ఎన్ని రోజులు నిల్వ ఉన్నదైతే అంత ఎక్కువ ప్రభావశీలంగా పనిచేస్తుంది.

### ఆచ్ఛాదన (మల్చింగ్)

కుండీల్లోని మట్టిని నిత్యం తేమగా ఉంచడానికి ఆచ్ఛాదన(మల్చింగ్) పద్ధతి బాగా సహకరిస్తుంది. ఈ ఆచ్ఛాదన ఎండి?ోయిన ఆకులతోను, ఎండు వరిగడ్డితోను చేసుకోవచ్చు. ఈ ఆచ్ఛాదన 7 నుంచి 10 అంగుళాల మందాన వేయాలి. తద్వారా కుండీల్లో ఉన్న మట్టి తేమను పట్టిఉంచగలుగుతుంది. తద్వారా మట్టిలో ఉన్న వానపాములు మట్టి పైభాగానికి రావడానికి అనువైన వాతావరణం అక్కడ ఏర్పడుతుంది. వాటితోపాటుగా కింది మట్టిలోని పోషకాలను మొక్కల వేళ్లకు అందుబాటులోకి తెస్తుంది. మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి.

### వేప కషాయం

### కావలసిన పదార్థాలు...

తాజా వేపాకులు అర కేజీ, తాజా దేశీ ఆవు పేడ అర కేజీ, దేశీ ఆవు పంచకం అర లీటరు. తయారీ విధానం: మెత్తగా నూరిన వే?కు మిశ్రమానికి ఆవు పేడ, ఆవు పంచకం చేతితో కలుపుకోవాలి. ఈ రకంగా కలుపుకున్న వేప కషాయాన్ని 3 రోజులు పులియబెట్టాలి. నాలుగో రోజున ఈ మిశ్రమాన్ని గుడ్డతో వడబోసి దాచుకోవాలి. 1:10 నిష్పత్తిలో వేప కషాయం, నీరు కలిపి ప్రతి పది నుంచి పదిహేను రోజుకొకసారి మొక్కలపై పిచికారీ చేసుకోవాలి.

### ఎగ్ అమైనో ఆమ్లం (ముట్టగయం):

### కావలసిన పదార్థాలు:

నాటు కోడిగుడ్లు 2 లేక 3, మూత ఉన్న గాజు సీసా(లీటరు ద్రవం పట్టే అంతది), నాటు కోడిగుడ్లు మునగడానికి కావలసినంత తాజా నిమ్మరసం, బెల్లం (సేంద్రియ బెల్లం ఉత్తమం) పావు కేజీ.

తయారీ విధానం: గాజు సీసాలో నాటు కోడిగుడ్లను (పగలగొట్టకుండా, పెంకు తీయకుండా) ఉంచాలి. గుడ్లు మునిగేంత వరకు తాజా నిమ్మరసం ?ోయాలి. మూత గట్టిగా పెట్టి 18 రోజులు వేడి తగలని ప్రదేశంలో ఉంచుకోవాలి. 18వ రోజున దీనిలో తురిమిన బెల్లాన్ని వేసి బాగా కలిపి ఆ రోజు నుంచి మళ్లీ పది రోజుల వరకు వేడి తగలని నీడ ప్రదేశంలో భద్రపరచాలి. మొత్తం 28 రోజుల్లో పిచికారీకి సిద్ధమవుతుందన్నమాట. పిచికారీ విధానం: సిద్ధమైన ఎగ్ అమైనో ఆమ్లంను ఒక లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కలిపి మొక్కలపై పిచికారీ చేసుకోవాలి. పిచికారీలో మరోపద్ధతి: 900 మిల్లీలీటర్ల నీటికి 100 మిల్లీలీటర్ల జీవామృతం, 2 మిల్లీలీటర్ల ఎగ్ అమైనో ఆసిడ్ కలిపి కూడా మొక్కలపై పిచికారీ చేసుకోవచ్చు. పూత పుష్కలంగా వస్తుంది. పూత రాలకుండా ఉండడానికి ఇది ఉపయోగ

# నాటు కోళ్లతో మంచి ఆదాయం ఆర్జిస్తున్న యువజంట..

నాటు కోళ్లు, జాతి (పందెం) కోళ్ల పెంపకం మారుమూల గ్రామాల్లో సైతం రైతుకు ఆధారపడదగినంత స్థాయిలో నిరంతర ఆదాయాన్ని అందిస్తుందని ఓ యువజంట రుజువు చేస్తున్నారు. గత పదేళ్లుగా శ్రద్ధగా ఈ పని చేస్తే ప్రజలకు ఆరోగ్యదాయకమైన మాంసం, గుడ్లను అందించటంతోపాటు స్వగ్రామంలోనే స్వయం ఉపాధి కల్పించుకుంటున్నారు రైతు దంపతులు ఉపేందర్‌రావు, జ్యోతి.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం బొజ్జాయిగూడేనికి చెందిన నిరుద్యోగులైన మూలగుండ్ల ఉపేందర్‌రావు, వజ్జా జ్యోతి పదేళ్ల క్రితం ఇంటి వద్ద ఒక షెడ్డును ఏర్పాటు చేసుకొని నాటు, పందెం కోళ్ల పెంపకం చేపట్టారు. చుట్టూ కోళ్ల ఎగిరి పోకుండా ఎత్తు జాలీ ఏర్పాటు చేశారు. నీడ కోసం పరిసర ప్రాంతంలో వివిధ రకాల చెట్లను పెంచారు. కోళ్ల మధ్యకు మాములు రాకుండా చూసేందుకు సీమ కోళ్లను, రెండు కుక్కలను పెంచారు. కొన్నేళ్ల క్రితం 20 జాతి (పందెం) కోడి పిల్లలను పలు ప్రాంతాల నుంచి సేకరించి పెంచటం మొదలుపెట్టారు. వీటి గుడ్లను సాధారణ కోళ్లకు వేసి పొదిగించి పిల్లలు తీసి సంతతిని పెంచారు. తదనంతరం ఇంక్యుబేటర్‌ను సమకూర్చుకొని పందెం కోడి పిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు. పిల్లల సైజును బట్టి వివిధ ధరలకు అమ్ముతున్నారు.



### 8 రకాల జాతి కోళ్లు

కోళ్లను 24 గంటలూ కనిపెట్టుకొని ఉండి అన్ని పనులూ ఉపేందర్‌రావు, జ్యోతి చేసుకుంటారు. వీరి వద్ద మార్కెట్‌లో మార్కెట్‌లో గిరాకీ ఉన్న నెమలి, కాక, డేగ, రసంగి, అబ్రాస్, సీత్వాల్, కెక్కర, ఎర్ర కెక్కర వంటి అనేక రకాల జాతి కోళ్లను వీరు పెంచుతున్నారు. రెండు వందల పెట్టలు, పుంజులు ఉన్నాయి. ఇవి దాణా కంటే ఆకుకూరలను ఎక్కువగా తింటున్నాయి. ఇంటి పరిసరాల్లో పలు రకాల ఆకుకూరలను,మునగాను పెంచి వీటికి మేపుతున్నారు. ఫామ్ హౌస్ యజమానులు జాతి కోళ్లను ఆసక్తితో పెంచుతుండటంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసుకెళు తున్నారు. కిలో బరువు గల జాతి కోడి రూ. 4 నుంచి 5 వేలు పలుకుతోంది. నెలలోపు చిన్న పిల్లలైతే రూ. 300 వరకు పలుకుతోందని ఉపేందర్ రావు తెలిపారు.

### మునగాకుతో జబ్బులకు చెక్!

మొదట్లో కడక్‌న్యాద్ కోళ్ల పెంపకం చేపట్టాం. మారుమూల ప్రాంతం కావటంతో వాటికన్నా జాతి (పందెం) కోళ్ల పెంపకంతోనే అధిక ఆదాయం వస్తోంది. జాతి కోడిగుడ్లను ఇంక్యుబేటర్ ద్వారా పొదిగించి పిల్లలను అమ్మటం వల్ల మంచి ఆదాయం పొందుతున్నాం. రెండు, మూడు సార్లు మందులు వాడితే ఈ కోళ్లకు ఎలాంటి జబ్బులు రావు. ముఖ్యంగా మునగ ఆకు తినిపిస్తే కోళ్లకు జబ్బులు వచ్చే ఛాన్సే లేదని ఉపేందర్‌రావు(95023 48987) అనుభవపూర్వకంగా చెబుతున్నారు.

## చిట్కుల్ పోచమ్మ అమ్మవారి దేవాలయం ఘనంగా రెండవ వార్షికోత్సవం

### -పూజలో పాల్గొన్న బేరి రామచంద్ర యాదవ్



పఠాన్ చేరు, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): చిట్కుల్ గ్రామం రమణీయ ఎన్‌క్లేవ్‌లోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయం రెండవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కాలనీ అధ్యక్షులు కృష్ణ ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి ఆర్కే మారుతి ముదిరాజ్, వరుణ్ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, కౌన్సిలర్ నీలం కవిత ముదిరాజ్ బృందంతో కలిసి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖశాంతులతో ఐకమత్యంతో జీవించాలని ఆకాంక్షించారు. కాలనీ అభివృద్ధి జరగాలని, అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ సాయన్న ముదిరాజ్, హరికృష్ణ చారి, మారుతి ముదిరాజ్, రవి చారి, సుభాష్, శ్రవణ్ కుమార్, ముత్యాలు, వరుణ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నీలం మధు ముదిరాజ్ సతీమణి కౌన్సిలర్ నీలం కవిత ముదిరాజ్ మహిళలతో కలిసి పూజలు నిర్వహించారు. పూజారి అరుణ్ పంతులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిట్కుల్ గ్రామస్తులు, ముత్తంగి, పరిసర కాలనీల ప్రజలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారి ప్రసాదంతో పాటు భోజనాల ఏర్పాట్లు చేసి దేవాలయం రెండవ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## విస్డం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి మార్చి15(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో విస్డం చారిటబుల్ ట్రస్ట్, భగల్ మీడియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా దినోత్సవ వేడుకలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం నీలిమ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని, మహిళా శక్తి చాలా గొప్పదని, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. తల్లిగా,చెల్లిగా, భార్యగా, కూతురుగా మహిళలు కుటుంబ సభ్యులకు అన్ని రకాలుగా చేదోడు వాదోడుగా ఉంటూ, కుటుంబ సంరక్షణలో పాలుపంచుకుంటున్నారన్నారు. అనంతరం డైనమిక్ లేడీ అవార్డ్స్- 2026 పేరిట వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళలకు షీల్డు, మెమొంటోలతో బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మేఘన, రిటైర్డ్ ఎమ్మార్వో పాలకుర్తి విజయలక్ష్మి, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ రజిత ఒజ్జల, నిర్వాహకులు నాగరాజు,స్వాతి, పద్మావతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎం హెచ్ డి ఆధ్వర్యంలో కాన్షిరామ్ జయంతి వేడుకలు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో మాదిగ హక్కుల దండోరా జిల్లా ప్రధాన కార్యదర్శి అకునూరి రాజ్ కుమార్,జిల్లా అధికార ప్రతినిధి శేఖర్ ల ఆధ్వర్యంలో కాన్షిరామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సంఘం జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ,రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ లు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు దేశంలో అసమాన వ్యవస్థ బాధితులను ఏకం చేసి దేశంలో అసమానత స్ఫూర్తిని పడగొట్టే వరకు ఆయన విశ్రమించలేదన్నారు.బహుజనులు పాలకులు కావడం ద్వారా మాత్రమే కుల రహిత సమాజాన్ని సృష్టించుకోగలమని అదొక్కటే పరిష్కారమని నమ్మి ఆచరించాడని అన్నారు.ఆయన ప్రయాణించడానికి ఒక సైకిల్,దారి ఖర్చుల కోసం చేతిలో ఒక హుండీ,తను ప్రసంగించిన చోట బహుజనులు హుండీలో వేసిన డబ్బుతో ఉత్తర ప్రదేశ్ అంతటా తిరిగి బహుజన రాజ్యం తీసుకొచ్చిన మహనీయుడి స్ఫూర్తితో బహుజనులందరు బహుజన సామ్రాజ్యం స్థాపించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.బ్రాహ్మణ వాదానికి మాత్రమే మేం వ్యతిరేకం బ్రాహ్మణులకు మేం వ్యతిరేకం కాదని చెప్పిన ఆయన కులరహిత సమాజం కోసం కులాన్ని ఉపయోగించుకుంటానని కూడా చెప్పారని అన్నారు.అసాధ్యాలను సుసాధ్యం చేయగల సమర్థుడు ఆయన అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు చిలుక రాజనర్సు,తుంగపల్లి గంగాధర్,గంగారపు రమేష్,అరికిల్ల దుర్గయ్య,అకునూరి రాజ్ కుమార్,గోగర్ల శేఖర్,గోగర్ల రమేష్,ఆరేపల్లి రమేష్,గుడిసెల ఐలక్క,ఇప్ప మల్లీశ్వరి,మోతే స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మల్టీ పర్పస్ వర్కర్లకు ఆరోగ్య శిబిరం 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహణ



మిడ్జిల్ మార్చి 15(లోకల్ గైడ్ ):మిడ్జిల్ మండలంలోని పెద్ద గుండ్ల తాండ, రాణిపేట్ గ్రామ పంచాయతీలలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమం భాగంగా ఆదివారం మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్కర్ల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి అవసరమైన వైద్య సేవలు అందించారు. గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ల కృషిని గుర్తిస్తూ వారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజునాయక్, మాధవి మల్లేష్, ఉపసర్పంచ్‌లు శ్రీనివాస్ నాయక్, పర్వీన్ బేగం పాల్గొన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు శైలజ, సుదర్శన్, అంగన్వాడీ టీచర్ మాధవి, గ్రామ ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలను బలోపేతం చేయడంలో మల్టీ పర్పస్ వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. అలాగే వారి ఆరోగ్యాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమని ఈ సందర్భంగా తెలిపారు.

# ఘనంగా మాజీ ఎంపీ నామ జన్మదిన వేడుకలు

### ప్రజా సేవలో ముందుండే నాయకుడు

### నామ: ఎమ్మెల్సీ తాత మధు

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా మాజీ ఎంపీ నామ జన్మదిన వేడుకలు



ఖమ్మం :లోకల్ గైడ్ :బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఆదివారం నాడు ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ,



జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాత మధుసూదన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తాత మధుసూదన్ కేక్ కట్ చేసి నామకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తాత మధు మాట్లాడుతూ నామ నాగేశ్వరరావుకు జిల్లా పార్టీ తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గత మూడు దశాబ్దాలుగా ప్రజా సేవలో నామ చేసిన కృషిని కొనియాడారు. ప్రజా జీవితంలో మరింత సేవ చేస్తూ, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం, కేటీఆర్ నాయకత్వంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నామ జన్మదిన వేడుకలు శనివారం అర్ధరాత్రి నుంచే ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాత్రి 12 గంటలు దాటగానే కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ నామకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలు ప్రాంతాల్లో యువకులు భారీ కేక్‌లను కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరిపారు. అలాగే ఆదివారం ఉదయం నుంచే పలు దేవాలయాల్లో నామ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం నామ క్యాంప్ కార్యాలయ ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉప్పల వెంకటరమణ, పగడాల నరేందర్, మాజీ సర్పంచ్ మెంటెం రామారావు ఆధ్వర్యంలో ఖమ్మం జీవన్ సంధ్య వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, పాలేరు, వైరా, మధిర, కొత్తగూడెం, అశ్వారావుపేట తదితర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో పండ్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పేదలకు భోజనం అందించేందుకు పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వైరా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నామ పుట్టిన రోజు సందర్భంగా ఇఫ్తార్ విందు కూడా ఏర్పాటు చేశారు. నామ నాగేశ్వరరావు రాజకీయాల్లోకి రాకముందు నుంచే ప్రజా సేవలో ముందుండే వ్యక్తి అని అభిమానులు తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మరించుకున్నారు. రాజకీయంగా మాత్రమే కాకుండా సామాజిక సేవలో కూడా నామ ముందుండి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన నాయకుడిగా నామ నాగేశ్వరరావు పేరు నిలిచిపోయిందని అభిమానులు అన్నారు. నామ నాగేశ్వరరావు ఆయురారోగ్యాలతో మరింత కాలం ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ అభిమానులు, శ్రేయోభిలాషులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఖమ్మం నగర పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషాబోయిన వీరన్న, కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి, తోట రామారావు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు గోపాల్, భాషాబోయిన వీరన్న, కనగాల వెంకట్రావు, నాయకులు బోజెడ్ల రాంమోహన్, పెనుగొండ ఏడుకొండలు, తన్నీరు రవి, ముత్యాల వెంకటఅప్పారావు, కోటి అనంతరాములు, బంకా మల్లయ్య, మరికంటి రేణుబాబు, వాకదాని కోటేశ్వరరావు, మందడపు వెంకటేశ్వరరావు, కోడె బాబు, కనగాల వెంకటేశ్వర్లు, నామ వెంకన్న, కొత్తపల్లి నాగార్జున, కోటేష్, బలుసు మురళి కృష్ణ, మహమ్మద్ రఫీ, మహిళా నాయకురాలు చిత్తారు ఇందుమతి, ఎమ్మెల్సీ తాత మధు పీఏ సుమంత్, మాజీ ఎంపీ నామ వ్యక్తిగత కార్యదర్శి గోపాళం నాగరాజు, యువ నాయకులు పాల్వంచ రాజేష్, తాళ్లూరి హరీష్ బాబు, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణ ప్రసాద్, పగడాల రవి, షారుఖ్, మునిగంటి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

# నాణ్యమైన విద్యుత్తుతోనే రైతుకు లాభం









### బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి వాకిటి శ్రీహరి

మిడ్జిల్ మార్చి 15(లోకల్ గైడ్ ):మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకార, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉంటేనే రైతుకు నిజమైన లాభం చేకూరుతుందని అన్నారు. జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కోరిన ప్రతిపాదనలను సీఎం వద్ద చర్చించి వెంటనే నిధులు మంజూరు చేయించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.గతంలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉండేవని, రైతులు పంట సాగులో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు జడ్చర్ల నియోజకవర్గంలో 31 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల్లోనే ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కృషితో మరో 21 సబ్‌స్టేషన్లు మంజూరు కావడం అభినందనీయమని చెప్పారు. ధైర్యం ఉన్న ఎమ్మెల్యేను గెలిపించుకోవడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని ఆయన అన్నారు.గత ప్రభుత్వాల సమయంలో వరి పంట వేస్తే రైతులు నష్టపోయే పరిస్థితి ఉండేదని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ కూడా ఇవ్వడం జరుగుతోందని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని పేదలందరికీ రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందించేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేశారని తెలిపారు.ముఖ్యమంత్రి రాజకీయ జీవితం 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మిర్చీల గ్రామంలో నిర్వహించనున్న బహిరంగ సభతో మిడ్జిల్ అభివృద్ధికి మరింత పునాది పడుతుందని మంత్రి చెప్పారు. గతంలో జడ్చర్లలో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించిన తీరు వల్ల వర్షాకాలంలో ప్రజలు ఆసుపత్రికి వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ఆపలేదని తెలిపారు.బోయిన్‌పల్లి ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేస్తామని, అలాగే బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలను పరిశీలించి బాలికలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టాయిలెట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జడ్చర్లలో ట్రిబుల్ ఐటీ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా విద్యా రంగంలో కూడా అభివృద్ధి సాధిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి పనులు చేస్తామని మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3600 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించి పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్లు నిర్మించామని చెప్పారు.

### అనంతరం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ

తాము గత పాలకుల మాదిరిగా కేవలం కొబ్బరికాయలు కొట్టి పనులు వదిలిపెట్టే వారు కాదని అన్నారు. ఒక పనికి శంకుస్థాపన చేస్తే అది పూర్తయ్యే వరకు వదిలిపెట్టబోమని తెలిపారు. ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో మాట్లాడి నియోజకవర్గంలో 22 సబ్‌స్టేషన్లు మంజూరు చేయించామని, అందులో మొదటిది బోయిన్‌పల్లిలో ప్రారంభించడం జరిగిందని చెప్పారు.తాను ఎమ్మెల్యే అయిన తరువాత నియోజకవర్గానికి సుమారు 2000 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చామని, అందులో కొత్త సబ్‌స్టేషన్లకు 69 కోట్లు, గృహజ్యోతి సబ్సిడీతో పాటు పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని తెలిపారు. ప్రజలతో కేవలం నమస్తేలు పెట్టుకోవడం కాదు, గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రిని ఎప్పుడు కలిసినా మిడ్జిల్ అభివృద్ధి గురించి మాట్లాడుతానని తెలిపారు.తన రాజకీయ జీవితానికి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మిడ్జిల్ మరియు ఊరుకొండ మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో జిల్లా కలెక్టర్‌తో సమావేశం నిర్వహించి రెండు మండలాల అభివృద్ధి పనులపై సమగ్ర నివేదికను సీఎంకు సమర్పించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ తంగేళ్ల జ్యోతి అల్వాల్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ బీమా నాయక్, డీఈ చంద్రమౌళి, ప్రసాదరావు, దినేష్ మోహన్ రావు, ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ నరేందర్ గౌడ్, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీవో గీతాంజలి, ఆర్ఐ అంబికా, బోయిన్‌పల్లి సర్పంచ్ పసుల శశికళ, ఉప సర్పంచ్ బోయ రామస్వామి, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సాయిలు, వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ గౌస్, శివ, మల్లికార్జున్ రెడ్డి, సత్యం గుప్తా, మిడ్జిల్ సర్పంచ్ శంకర్, రాజు నాయక్, ధర్మానాయక్, చందు నాయక్, రాములు, ఉప సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, ఎండి జహీర్ ఉస్మాన్ కోట్ల పర్వతాలు నరసింహులు గుప్తా మల్లేష్ భాస్కర్ నాయక్ కుమార్ నాయక్ శంకర్ నాయక్ శ్రీను నాయక్ శంకర్ నాయక్ ఆజాం నరేందర్ రెడ్డి సంపత్ కుమార్ పలు గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం : హుస్నాబాద్ చైర్ పర్సన్ దండి లక్ష్మీ




హుస్నాబాద్ మార్చి 15 లోకల్ గైడ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాచేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రణాళికా బద్ధంగా అమలు చేయాలని హుస్నాబాద్ పట్టణ పురపాలక సంఘ చైర్ పర్సన్ దండి లక్ష్మీ సూచించారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో ఆమె పాల్గొని పట్టణ నర్సరీ పర్యవేక్షించారువర్షాకాలంలో మొక్కలు నాటుట గురించి, ఇంటింటికి మొక్కల పంపిణీ కి ఏ మొక్కలు పంపిణీ చేయాలో వాటిని నర్సరీ లో పెంచాలని అధికారులకు పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి దిశగాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికాకార్యక్రమాన్ని సమర్ధ వంతంగా అమలు చేసే విధంగా అధికారులసమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్స్, కౌన్సిలర్ బలిశెట్టి రాజు, పూదరి వరప్రసాద్, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, మున్సిపల్ అధికారు లు, వార్డ్ ఆఫీసర్లు మెప్మా రిసోర్స్ పర్సన్స్, నర్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499